# జ్ఞాన రత్నాలు



## సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాల సేకరణ



# శ్రీ బంగారు రాజు గారు మరియు

# శ్రీమతి రాజేశ్వరిగారి సంస్మరణార్థం

- **ఆధ్యాత్మిక అహంకారం ఎలా కలుగుతుంది?**

✓ మీరు గుడిలోకి వెళితే వెళ్ళండి కాని అవతల వారు గుడికి రావటం లేదు, వారు పాడైపోయారు అని అనుకోకండి; అలా అనుకుంటే గుడికి వెళ్లనివారు బాగానే ఉంటారు, కాని మనం పాడైపోతాము.

- **లోకానికి అతిపెద్ద ఉపకారం ఎలా సాధ్యం?**

✓ జ్ఞానానికి శక్తి లేదు అనుకోకండి. మీరు నిజంగా జ్ఞానం సంపాదిస్తే లోకానికి మీ ద్వారా జరిగే ఉపకారం ఎవ్వరి వలనా జరుగదు. అధికారం లో ఉన్నవారి వలనా జరుగదు. ధనం ఉన్నవారి వలనా జరుగదు. ఎందుచేతనంటే నిప్పు వేడి లేకుండా ఎలా ఉండదో, జ్ఞానం శక్తి లేకుండా ఉండదు.

- **పునర్జన్మ ఎప్పుడు రాదు?**

✓ మన శరీరం చనిపోయేటప్పుడు బాహ్యవిషయాల తోటి సంబంధం లేకుండా నూటికి నూరు పాళ్ళు శాంతిగా ఉన్నాము అనుకోండి అప్పుడు మనకు పునర్జన్మ ఉండదు. అలా శాంతిగా ఉండలేకపోతే ప్రకృతి నిన్ను చుట్టేస్తోంది.

- **పునర్జన్మ ఎప్పటివరకు తప్పదు?**

✓ జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి. తాత్కాలికంగా సుఖపడుతున్నాము అని మీకు అనిపించినా పరిణామంలో ఇదంతా దుఃఖంగా మారిపోతుంది. మీరు నూటికి నూరుపాళ్లు నిర్వాణ సుఖం పొందేవరకు మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. దుఃఖం ఉన్నంతవరకు మీకు పునర్జన్మలు తప్పవు.

- **వాసన పెంచుకుంటూ వెళ్ళితే కలిగే నష్టం ఏమిటి?**

✓ స్వరూపం నుంచి ఎంత బయటకి వచ్చారో అంతలోపలికి వెళ్తే గాని మీరు హృదయగుహలో పడలేరు.

- **శ్రీ రామకృష్ణుని పవిత్రత తెలిపే సంఘటన:**

✓ ఒక భక్తుడు రామకృష్ణ పరమహంస పేరు మీద అయిదు ఎకరాల భూమి రాస్తే, శ్రీ రామకృష్ణులు రోజూ వారి ఇంటికి వెళ్లి ఇలా బతిమాలేవారు: 'నాకు రోజూ అయిదు ఎకరాల పొలం ఉంది అనే విషయం ఒక్కటే జ్ఞాపకం వస్తుంది. నువ్వు ఇంక నన్ను భగవంతుడిని తెలుసుకోనివ్వవా? నీ అయిదు ఎకరాల భూమి వెనక్కి తీసుకో '.

- **ఏది ఉంటే అంతా ఉంది, ఏది లేకపోతే ఏమీ లేదు?**

✓ ఈ దొంగ నేను ఉంటే అంతా ఉంది. ఈ దొంగ నేను లేకపోతే ఏదీ లేదు. మనస్సు ఉన్నంత కాలం మనస్సు కల్పించింది కూడా ఉంటుంది. మనస్సు ఎప్పుడైతే నశించిందో, మనస్సు కల్పించింది కూడా నశిస్తుంది.

- **అణుకువకు ఉదాహరణ:**

✓ ఒక సీనియర్ ఉద్యోగి ఒక జూనియర్ ఉద్యోగికి పాఠం చెబుతున్నారు. వారిద్దరూ biochemistry కి సంబంధించినవారు. మీరు ఈ అబ్బాయికి పాఠం బాగా చెబుతున్నారు అని నాన్నగారు అంటే, ఆ సీనియర్ ఉద్యోగి అన్నారట: 'ఆ అబ్బాయి పాఠం చెప్పే అవకాశం ఇచ్చాడు కాబట్టే చెప్పకలుగుతున్నాను'.

- **శ్రీ రామకృష్ణ వివేకానందుల మొదటి సమావేశం:**

✓ మొదటి సారి నరేంద్రుడిని చూసినప్పుడు శ్రీ రామకృష్ణులకు గతజన్మ స్మృతులు కలిగి ఇలా అన్నారట: 'వీడు నరేంద్రుడా లేక పరిపూర్ణుడా?'

- **<u>శివ కేశవుల మధ్య బేధం చూడవచ్చా?</u>**

✓ విభూతి అంటే ఐశ్వర్యం. పరమాచార్య ఒక లాయర్ కి కుంకుమ విభూతి ఇచ్చినప్పుడు ఆ లాయర్ విభూతి పెట్టుకోడానికి సంకోచించాడు. అది చూసి పరమాచార్య అన్నారట: 'ఇంత చదువు చదివి ఇంకా శివ కేశవుల మధ్య బేధం చూస్తున్నావా?'

- **<u>అరుణాచలేశ్వరుడు భగవాన్ని అనుగ్రహించిన తీరు:</u>**

✓ భగవాన్ అన్నారు: ఓ అరుణాచల! నేను ఏమి యోగాభ్యాసాలు చేయలేదు. బ్రహ్మాజ్ఞానం గురించి శ్రవణం చేయలేదు. అసలు బ్రహ్మాపదార్థం అంటూ ఒకటి ఉందని నాకు తెలియదు. నేను అరుణాచలం అని అన్నాను అంతే.  అజ్ఞానం నుంచి జ్ఞానం లోకి, అసత్యంలోంచి సత్యం లోకి, మృత్యువు నుంచి అమృతత్వం లోకి, ఒక్క జంప్ వేయించావు.

- **<u>భగవద్దర్శనం వలన కలిగే లాభం:</u>**

✓ శివుడు అభిషేకప్రియుడు, విష్ణువు అలంకారప్రియుడు, సూర్యుడు నమస్కార ప్రియుడు, గణపతి గుంజీలు ప్రియుడు, మరియు కుమారస్వామి దర్శన ప్రియుడు. భగవంతుని దర్శనం వలన మనం పునీతులం అవుతున్నాము, మరియు సద్బుద్ధి కలుగుతుంది.

- **<u>జీవితంలో నేర్చుకోవాల్సిన రెండు విషయాలు:</u>**

✓ చేతులతో సత్కర్మ చేయి. మనస్సుతో భగవంతుని స్మరించు. అప్పుడు పవిత్రుడవౌతావు. పవిత్రత వలన సద్బుద్ధి కల్గుతుంది, బ్రహ్మ జ్ఞానం కల్గుతుంది.

- **<u>సంసారం అంటే ఏమిటి? అది ఎలా అధిగమించగలము?</u>**

✓ సంసారం అంటే మీ ఇంట్లో ఉన్న మనుష్యులు కాదు. మీ ఇష్ట-అయిష్టాలు, రాగ-ద్వేషాలు, కోప-తాపాలు, కోరికలు-వాంఛలు, -అది సంసారం. ఈ చావు పుట్టుకలు అనే సంసార రూప అగ్ని లోంచి బయటకు రావాలంటే మీ సాధన ఒక్కటే సరిపోదు. ఈశ్వరానుగ్రహం, గురు అనుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు.

- **<u>మిథ్యాచారి ఎవరు? కూలివారు ఎవరు?</u>**

✓ కొంతమందికి మనస్సులో ఒకటి ఉంటుంది కానీ బయటకు ఇంకొకటి మాట్లాడుతారు. రెండు బూరెలు తినకలిగినా ఒకటే బూరె తింటారు. అలాంటివారిని కృష్ణుడు మిథ్యాచారి అని పిలిచాడు. కొంతమంది కలిసి రాకపోతే నవ్వరు, మాట్లాడరు. అలా ఫలకాంక్ష తో పని చేసేవారిని కూలివారు అని పిలిచాడు.

- **<u>పాములవంటి తలంపుల నుండి పారిపోండి:</u>**

✓ మాకు గౌరవం ఉంది, సోషల్ స్టేటస్ ఉంది, ఎకనామిక్ స్టేటస్ ఉంది అని ఇటువంటి తలంపులు మీకు ఉంటే, ఈ తలంపుల నుండి రన్ అవే, రన్ అవే. పామును చూస్తే పారిపోయినట్లు పారిపోండి. దేహం నేను అనే తలంపు ఎంత నిజమో ఈ గౌరవాలు కూడా అంతే నిజము. ఇవన్నీ ఒకటి లేని సున్నాలు.

- **<u>గౌరవాలతో జ్ఞానం పొందవచ్చా?</u>**

✓ బోడి మెడను బంగారపు గొలుసుతో అలంకరించినట్లు, ఈ దేహం నేను అనే తలంపుని సమాజంలో సంపాదించిన గౌరవంతో అలంకరించవచ్చు. నేను అనే తలంపుకు లోపల అజ్ఞానం అలాగే ఉంటుంది. అదనంగా గౌరవం అనే అలంకారం ఉంటుంది.

- **భగవంతుని మోసగించవచ్చా?**

✓ కొంతమందికి లోపల గర్వం ఉంటుంది. అది మనకు కనపడకుండా వాళ్ళు మన కళ్ళు కప్పుతున్నారు కాని, దేవుని కళ్ళు ఎలా కప్పగలరు?

- **తెలివితేటల ప్రాముఖ్యత:**

✓ వివేకవంతంగా తెలివితేటలతో జీవించండి. మన తెలివితేటలు మనకే కాదు, సమాజానికి ఉపయోగపడాలి, మనం భగవంతుని తెలుసుకునేందుకు ఉపయోగపడాలి. ఎవరైనా మొదటిసారి మనలను మోసం చేస్తే, అది మోసం చేసినవాడి తప్పు. కానీ రెండో సారి మోసం చేస్తే, మోసం చేసినవాడి తప్పు కాదు, అది మన తప్పు.

- **ఈ రెండు విషయాలు విడవకండి:**

✓ భక్తులందరూ ఈ రెండు విషయాలు విడవకండి: ఒకటి ఆలోచన, రెండు సబ్జెక్టు. మీరు మాట్లాడితే సబ్జెక్టు ఒక్కటే మాట్లాడండి. మీకు ఎవరైనా ఏదైనా చెప్పినా సబ్జెక్టు గురించే వినండి. ఎవరైనా లౌకిక విషయాలు చెపితే పాముని చూసి పారిపోయినట్లు పారిపోండి. సబ్జెక్టు చెప్పేవాడు కనిపించకూడదు, సబ్జెక్టు ఒక్కటే కనపడాలి.

- **జ్ఞాని మాట ఎందుకు దేవుడై ఉన్నది?**

✓ స్వీట్ లో పంచదార, నెయ్యి ఉన్నట్లు జ్ఞాని ప్రతీ మాట లో కరుణ, ప్రేమ ఉంటాయి. అక్కడ వెలుతురు ఉంటుంది. మిమ్మల్ని హృదయం యొక్క లోయల్లోకి తీసుకెళ్తుంది. మాట దేవుడై ఉన్నది.

- **శ్రీ రామకృష్ణుల sincerity:**

✓ ఎప్పుడైనా భక్తులు తమ ఇంటికి ఆహ్వానిస్తే శ్రీ రామకృష్ణులు వెళ్లేవారు. కాని కొంతమంది శ్రీ రామకృష్ణులను పిలిచినట్లు మరచిపోయి ఆ సమయానికి ఇంట్లో ఉండేవారు కాదు. అప్పుడు శ్రీ రామకృష్ణులవారు తాను వచ్చి వెళ్లడం జరిగింది అని తలుపు మీద రాయించే వారు. అట్టిది ఆయన sincerity. దీనిని అవమానంగా భావించేవారు కాదు.

- **ప్రపంచం లో సాధించిన వాటికన్నా శ్రేష్టమైనది?**

✓ ప్రపంచం లో మీరు ఎంత సాధించినా, ఆ సాధించిన విషయాల కన్నా మీ మనోనిగ్రహం గొప్పది. ప్రపంచం లో ఏదో సాధించడం కన్నా, మీ మనస్సుని బాగు చేసుకోవడం అత్యంత శ్రేష్టమైనది.

- **అనవసరమైన మాటలు మాట్లాడితే భగవాన్ ఏమి అనేవారు?**

✓ ఆత్మసాక్షాత్కారం అయ్యాక, ఇప్పటిదాకా ఏ శవంలో ఎన్ని సుఖాలు అనుభవించినా, ఏ శవంలో ఎన్ని దుఃఖాలు అనుభవించినా, అవన్నీ అబద్ధాలు అని తెలుస్తుంది. అట్టిది జ్ఞానం యొక్క వైభవం. భగవాన్ దగ్గర ఎవరైనా అనవసరమైన మాటలు మాట్లాడితే 'అది జ్ఞానమా' అని అనేవారట భగవాన్.

- **మొత్తానికే పని చేయడం మానకండి అని చెప్పే ఉదాహరణ**

✓ సూర్యుడు చేసే పని మేమెక్కడ చేయగలము అని మొత్తానికే పని చేయడం మానేయడం కన్నా, కిరోసిన్ ఆయిల్ దీపం చేసే పని చేయండి.

- **<u>భగవంతుడు గురువు మధ్య భేదమేమిటి?</u>**

✓ మామిడి పండులో టెంక, పీచు, తోలు, రసము ఉంటాయి. భగవంతుడు అంటే మొత్తం మామిడి పండు. కానీ గురువు అంటే కేవలం రస స్వరూపుడు.

- **<u>హృదయ శుద్ధి గలవారు ఎందుకు ధన్యులు?</u>**

✓ నీ మనో దేహములకు సంబంధం లేకుండా నీ హృదయం లో ఏదో ఒక సత్యం ఉంది. హృదయంలో అంతర్యామిగా ఉన్న సత్యం, హృదయ శుద్ధి గలవారికే గోచరింప పడుతుంది. హృదయ శుద్ధి లేనివాడికి హృదయంలో సత్యం ఉన్నా, వాడికి తెలియబడదు. అందుకే హృదయ శుద్ధి గలవారు ధన్యులు.

- **<u>హిట్లర్ సిద్ధాంతం:</u>**

✓ హిట్లర్ సిద్ధాంతం: ఒక అబద్ధాన్ని మీరు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో, కంగారు పడకుండా పదిసార్లు చెబితే, ఆ అబద్ధం కాస్త నిజం అయిపోతుంది.

- **<u>వెంటనే జ్ఞానోదయం కలగడాన్ని వర్ణించే ఉదాహరణలు:</u>**

✓ నీరు పోసిన వెంటనే నిప్పు ఎలా ఆరిపోతుందో, మందు వాడిన వెంటనే ఆరోగ్యం ఎలా సమకూరుతుందో, మనోమాలిన్యం తొలగిన వాడికి లోపల ఉన్న శాంతి ఉదయించడం రెండూ ఒకే సారి జరిగిపోతాయి.

- **<u>ప్రారబ్ధం ఎవరికి ఉండదు?</u>**

✓ భగవాన్ అన్నారు:  నీకు నూటికి నూరు పాళ్లు భగవంతుని పై విశ్వాసం కుదిరితే నీకు ప్రారబ్ధం ఏమిటి రా?

- **<u>అనుకరణ పనికిరాదు అనటానికి రానాడే ఉదాహరణ:</u>**

✓ ఇతరులను అనుకరిస్తూ మన స్వభావానికి విరుద్ధమైన పని చేస్తే అశాంతి తప్పదు. తిలక్ గారు ఒకసారి రానాడే అనే ఉపాధ్యాయునికి రాజకీయాల్లోకి రమ్మని ఉత్తరం రాస్తే, రానాడే ఇలా జవాబు ఇచ్చారు: 'రాజకీయాలు మంచివే అయి ఉండవచ్చు. కానీ అది నా స్వభావానికి విరుద్ధమైన పని. అందుకు నేను రాజకీయాల్లోకి రాలేను'.

- **<u>పూర్ణ సత్యం vs సాపేక్షిక సత్యం:</u>**

✓ పూర్వ జన్మల గొడవలు, రాబోయే జన్మల గొడవలు - ఇవన్నీ నగ్న సత్యాలు కావు, సాపేక్షిక సత్యాలు లేక వ్యావహారిక సత్యాలు. మీ హృదయం లో ఒక సత్యం ఉంది. అది పూర్ణ సత్యం. మీకు ఎన్ని అవకాశములు ఉంటే అన్ని అవకాశములను ఉపయోగించుకొని దాన్ని తెలుసుకోడానికి ప్రయత్నం చేయండి.

- **<u>కపిల మహర్షిని ఆయన తల్లి అడిగిన విషయం:</u>**

✓ కపిల మహర్షి వాళ్ళ అమ్మని ఆరోగ్యం బాగుందా? అన్నం సరిగ్గా తింటున్నావా? అని ఇలాంటి కుశల ప్రశ్నలు వేసేవారు. అప్పుడు తల్లి అంటుంది: 'ఇలాంటి ప్రశ్నలు వేసి ఎన్నాళ్ళు నన్ను మభ్యలో పెడుతావు? మోక్షం వచ్చే ఉపాయం చెప్పు. ఈశ్వరుని పాదాల దగ్గరికి చేర్చుకునే ఉపాయం చెప్పు. ఈ కట్టె కట్టెల్లో కలిసిపోకముందే నేను తరించే ఉపాయం చెప్పు'.

- **<u>మీకున్న విభూతులను ఎలా ఉపాయోగించాలి?</u>**

✓ మీకు తెలివితేటలు ఉన్నా, వివేకం ఉన్నా, డబ్బు ఉన్నా - అవన్నీ భగవంతుని పాదాలయందు భక్తి కలగటానికి సహకరించాలి. అలాకాకపోతే అవన్నీ ఒకటి లేని సున్నాలతో సమానం.

- **<u>ఒక వ్యక్తితోటి మాట్లాడుతూంటే వారు ఆశించేదేమిటి?</u>**

✓ ఎవరితోటైనా మాట్లాడుతూంటే వారికి మీ దగ్గర ఉన్న డబ్బుతో గాని చదువుతో గాని సంబంధం లేదు. మీరు నోటినిండా మాట్లాడుతున్నారా లేదా, హృదయం నిండా ప్రేమ తో మాట్లాడుతున్నారా లేదా - ఈ రెండే వారు చూసేది. ఒక మంచి మాట మాట్లాడటానికి దారిద్ర్యం ఎందుకు?

- **<u>యుద్ధానంతరం ధృతరాష్ట్రునికి ఏమి అనిపించింది?</u>**

✓ మహాభారత యుద్ధం తర్వాత దృతరాష్ట్రుడు ఇలా అనుకున్నాడు: ' స్వప్నంలో బంగారం లభిస్తే, 'చాలా బాగుంది, చాలా బాగుంది, బంగారం దొరికింది,' అని అనుకునే లోపు మెలకువ వచ్చేస్తే, ఆ బంగారం అంతా పోతుంది. అలాగే ఈ రాజ్యం అంతా స్వప్నం లో బంగారం కనిపించి పోయినట్లు పోయింది'.

- **<u>మన తెలివితక్కువతనాన్ని ఎత్తిచూపిన ఏసు మాటలు:</u>**

✓ ఏసు క్రీస్తు అన్నాడు: మీ శరీరానికి ఇస్తున్న విలువ, మీ బట్టలకు ఇస్తున్న విలువ, మీ ఇంటిపైన పెంకులకు ఇస్తున్న విలువ, శరీరం చనిపోయాక మీ కూడా వచ్చే మనస్సుకు ఆమాత్రం విలువ కూడా ఇవ్వరా? ఇది చెప్పేవారు ఎవరూలేరా? ఒకవేళ ఉన్నా మీరు వినటంలేదా?

- **<u>ఏది కడసారి జన్మ లేక చిటారు కొమ్మ?</u>**

✓ భగవద్గీత లో కృష్ణుడు అన్నాడు:'ఓ అర్జునా! ఉన్నదంతా ఈశ్వరుడే. మరి నువ్వు (దొంగ నేను) ఎక్కడనుంచి వచ్చావు అని విచారణ చేసుకుంటే నువ్వు అసలు లేవు అన్న సంగతి నీకు తెలుస్తుంది. అది నీ కడసారి జన్మ. అదే చిటారు కొమ్మ. బహుజన్మల సుకృతఫలం ఉంటే కానీ ఇదంతా వాసుదేవ స్వరూపం అని నీకు అనుభవంలోకి రాదు అర్జునా!'

- **లోకంతో మనకున్న అనుబంధం ఎటువంటిది?**

✓ లోకంతో మనకున్న అనుబంధం నూటికి నూరుపాళ్లు స్వార్థంతో కూడినది. ఆ స్వార్థాన్ని తగ్గించుకోమని మనకు చెబుతున్నారు.

- **మధ్వాచార్యులు కృష్ణ భక్తి:**

✓ మధ్వాచార్యులు అన్నారు: మీకు లక్ష్మీదేవి అంటే బాగా ఇష్టం అనుకోండి, ఆ కృష్ణుడికే లక్ష్మీదేవి వేషం వేసి పూజ చేసుకోండి. అంటే మధ్వాచార్యుల వారికి కృష్ణుడంటే అంత ఇష్టం.

- **భక్తులలో అగ్రగణ్యుడైన ప్రహ్లాదుని చరిత్ర:**

✓ హిరణ్యకశ్యపుడు అంటాడు: 'ఏమయ్యా ప్రహ్లాద! విష్ణు, విష్ణు, నారాయణ, నారాయణ అంటావేమిటి? ఎవరి అండ చూసుకొని ఇంతటి పొగరుబోతు మాటలు మాట్లాడుతున్నావు?' అప్పుడు ప్రహ్లాదుడు అన్నాడు: 'నీకు ఆధారం, నాకు ఆధారం, ఈ సృష్టికి ఆధారమైన నారాయణుని చూసి మాట్లాడుతున్నాను. ఆ నారాయణుడు అంతటా అన్ని కాలాల్లో లేకపోతే దేవుడు కాదు'. అప్పుడు ఒక స్తంభాన్ని చూపించి 'ఈ స్తంభంలో ఉన్నాడా?' అని అడుగుతాడు హిరణ్యకశ్యపుడు. అంతటా ఉన్నవాడు స్తంభంలో లేకుండా ఎలా ఉంటాడు?' అని ప్రహ్లాదుడు అంటే, గద పుచ్చుకొని ఆ స్తంభాన్ని బాదాడు హిరణ్యకశ్యపుడు. రాముడు కృష్ణుడు వీళ్ళు ఓడలు. చాలా మందిని వైకుంఠానికి మోసుకుపోయారు. కానీ ఒక్క ప్రహ్లాదుని రక్షించడానికి లక్ష్మి నరసింహ స్వామి అవతారమెత్తి వచ్చాడు.

- **ధ్రువుడు కోరుకున్న వరం:**

✓ ధ్రువుడు నిద్రాహారాలు లేకుండా, నారాయణ నామం స్మరిస్తూ, హృదయంలో ఆత్మ రూపంలో ఉన్న ఈశ్వరుని ధ్యానిస్తూంటే, ఆ మహావిష్ణువే ధ్రువుడికి వచ్చి దర్శనమిస్తాడు. కానీ ధ్రువుడు చూడడు. అప్పుడు విష్ణువు: 'నీ హృదయంలో ఎవరిని ధ్యానిస్తున్నావో వాడినే నేనయ్యా. ఏదైనా కోరిక కోరుకో'

అని అంటే 'నీ పాదాల పైన భక్తి నాకెప్పుడూ నిలబడి ఉండాలి' అని ధ్రువుడు కోరుకుంటాడు. అలా కొంతమంది భక్తులు ముక్తి కంటే భక్తికే అగ్రస్థానం ఇస్తారు. ఆ డివోషన్ లో వాళ్లకు enjoyment ఉంటుంది. వాళ్లకు enjoyment కోసం బాహ్యమైన వస్తుజాలం అక్కర్లేదు, పదార్థాలు అక్కర్లేదు. వాళ్ళని వాళ్ళే ఎంజాయ్ చేస్తూ ఉంటారు. ఆత్మని ఆత్మే ఎంజాయ్ చేస్తూ ఉంటుంది.

- **<u>కృష్ణుడి ఏ రహస్యాలు తెలిస్తే మనకు జన్మరాహిత్యం?</u>**

✓ కృష్ణుడు అన్నాడు: 'నా జన్మ రహస్యం, కర్మ రహస్యం తెలుసుకున్నవాడు, పునర్జన్మ రాహిత్యమే కాదు, నా స్వరూపాన్ని పొందుతాడు'. జన్మ రహస్యం అంటే ' కృష్ణుడు పుట్టినా, పుట్టని వాడితో సమానం' అని అర్థం. కర్మ రహస్యం అంటే ' కృష్ణుడు పనిచేసినా, చేయనివాడితో సమానం' అని అర్థం.

- **<u>మనకు శాస్త్రం మీద గౌరవం కలగక పోవడానికి కారణం?</u>**

✓ భగవద్గీత లోని మాటలు మీకు అర్థం కాకపోతే అవి అబద్ధాలు అనుకోవద్దు, అది మీ పాపం అని గ్రహించండి. భగవద్గీత అంటే శాస్త్రం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు - అన్నిటి సారం భగవద్గీత లో ఉంది. మన బుద్ధి శాస్త్రం మీద గౌరవం కలగనీయడం లేదు ఎందుకంటే మనకు పుణ్య బలం లేదు.

- **<u>గాంధీగారు తన భార్యకు రాసిన ఉత్తరం:</u>**

✓ శరీరం ఉన్నప్పుడు మనం ఎలా ఉంటామో, శరీరం చనిపోయాక కూడా అలా ఉంటాము. ఉండటానికి భంగం లేదు. ఉంటాము. ఈ అనుభవం శరీరం ఉండగానే సంపాదించాలి. అప్పుడు ఈ శరీరం పోయినా పర్వాలేదు. అప్పుడు నీకు మరణం అంటే భయం పోతుంది.

- **<u>వచ్చినపని మరచిపోకండి:</u>**

✓ కృష్ణుడు అన్నాడు: 'అర్జునా! నన్ను తెలుసుకోడానికంటే మించిన ధర్మం ఉందా? నన్ను తెలుసుకోడానికంటే మించిన జ్ఞానం ఉందా? నన్ను తెలుసుకోడానికంటే మించిన సత్కర్మ ఉందా? ఈ జ్ఞానానికైనా, ధర్మానికైనా, సత్కర్మకైనా గమ్యం నేనే కదా. అది మరుపు పనికి రాదు. వచ్చినపని మరచిపోకండి. మీరు ఏదిగా ఉన్నారో దాని తాలూకు స్మృతి, స్పృహ మీకు ఉండాలి'.

- **<u>దక్షిణేశ్వరంలో గాంధీగారి ప్రవచనం:</u>**

✓ దక్షిణేశ్వరంలో గాంధీ గారు అన్నారు: 'మీరందరూ స్వాతంత్ర సమరం లో పాల్గొనండి లేక దేశం కోసం త్యాగం చేయండి అని చెప్పడానికి నేను ఇక్కడికి రాలేదు. ఎవరిని స్మరించుకుంటూంటే నేను పవిత్రుడను అయ్యానో, ఎవరి బోధలు వినడం వలన బుద్ధి లో వంకరలు పోతున్నాయో, ఎవరు అవలంబించిన బ్రహ్మచర్యాన్ని ఆదర్శంగా తీసుకున్నానో, వారికి ఇక్కడ కృతజ్ఞత చెప్పడానికి వచ్చాను గాని, మీకు బోధించడానికి రాలేదు'.

- **<u>తీర్థకరుడు అంటే అర్థం ఏమిటి?</u>**

✓ విష్ణుసహస్రనామం లో తీర్థకరుడు అనే ఒక నామం వస్తుంది. సాధారణంగా తీర్థం అంటే జలం అని అర్థం. కానీ ఇక్కడ తీర్థం అంటే శాస్త్రం అని అర్థం. ఎవరైతే మనకు శాస్త్రాన్ని ఇచ్చారో, ఆ శాస్త్రానికి అనుగుణంగా జీవిస్తేనే వాడిలో ఐక్యం అవుతాము.

- **<u>పోగొట్టుకోవలసినది ఏమిటి? సంపాదించవలసినది ఏమిటి?</u>**

✓ పోగొట్టుకోవలసినది దేహాత్మబుద్ధి. సంపాదించవలసినది బ్రహ్మాత్మబుద్ధి.

- **ఎవరు సుహృత్?**

✓ మీరు భవిష్యత్తులో ఏదైనా ఉపకారం చేస్తారని ఆశించి నేను మీకు ఉపకారం చేస్తే అది భక్తి కాదు, కేవలం వ్యాపారం అవుతుంది. మీరు తిరిగి ఏమి ఉపకారం చేస్తారు అనే ఆలోచనతో సంబంధం లేకుండా నాకు శక్తి ఉంది కాబట్టి ఉపకారం చేస్తే, అటువంటివారిని పరమాత్మ సుహృత్ అని పిలిచాడు. అటువంటి సుహృత్ మహావిష్ణువు యొక్క దయకి పాత్రుడౌతాడు.

- **నమ్మాళ్వార్ అద్వైత వర్షం:**

✓ నమ్మాళ్వార్ అన్నారు: 'ఇప్పటివరకు నేను ఉన్నాను అని అనుకుంటున్నాను. నిన్ను తెలుసుకున్నాక అసలు నేను లేనే లేను, ఉన్నది నీవే, అన్న సంగతి తెలిసింది'. ఇది అద్వైతానుభవం, అమృతవర్షం, అద్వైతవర్షం'.

- **భగవన్నామము చేయడం వల్ల కలిగే లాభాలు:**

✓ నామం చేయడం వల్ల ఏకాగ్రత వస్తుంది, పని యందు నిష్ఠ పెరుగుతుంది, బద్ధకం పోతుంది, తమోగుణం పోతుంది, నువ్వు పవిత్రుడవు అవుతావు, అన్నిటికంటే ముఖ్యంగా భగవంతునికి వంటింటి బంధువు అయిపోతావు. అలా అయ్యాక నువ్వు భగవంతుని హృదయం ప్రవేశిస్తావు. అప్పుడు ఆయన తన స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తాడు.

- **భగవంతుని మాటలు ఎవరికి చేదుగా ఉంటాయి?**

✓ నిరంతరం కర్మఫలకాంక్ష ఉన్నవారికి భగవంతుని మాటలు నోట్లో ఆముదం వేసుకున్నట్లు చేదుగా ఉంటాయి.

- **<u>మాయ లోంచి బయట పడే మార్గం:</u>**

✓ ఈశ్వరుని పాదాలకు అంకితమై ఉంటే మాయలోంచి బయటకు వచ్చేస్తాము. చాపలు పట్టేవాడు వలవేస్తే దూరంగా ఉన్న చాపలే వలలో పడుతాయి గాని పాదాల దగ్గర ఉన్న చాపలు వలలో పడవు.

- **<u>మనస్సుకి ఏది మూలం?</u>**

✓ వేదంలో ఇలా చెప్పబడింది: పెద్ద వృక్షానికి ఏది మూలం? బీజం మూలం. చాలా గొడవలు ఉన్న ఈ పెద్ద మనస్సుకి ఏది మూలం? కామం మూలం.

- **<u>కర్మ రహస్యం ఏమిటి?</u>**

✓ మీ చేతిలో ఉన్నపని పట్టించుకోండి. ఆ పని ఫలితం వదిలేయండి. ఇది కర్మ రహస్యం. మీ చేతిలో ఉన్నపని హృదయపూర్వకంగా చేస్తే అదికూడా భక్తి తో సమానమే. కర్మఫలితం ఈశ్వరుని చేతిలో ఉంది. కర్మఫలితం మీద కాంక్ష ఉన్నప్పుడు ఎక్కువ అశాంతి వస్తుంది. మనం కర్మఫలితం వదిలేసినంత మాత్రాన వచ్చేది ఆగదు.

- **<u>మళ్లీ ఈ లోకంలోకి ఎప్పుడు రావక్కర్లేదు?</u>**

✓ ఎన్ని గౌరవాలు, ధనాలు, చదువులు సంపాదించినా, అవన్నీ డ్రీంస్టఫ్. హృదయంలో ఉన్న శాంతి దొరకకపోతే పునర్జన్మ వచ్చి తీరుతుంది. మన శరీరం విడిచిపెట్టేటప్పుడు హృదయంలో ఉన్న 100 % శాంతి మనచేతిలో ఉంటేనే మళ్లీ ఈ లోకంలోకి రావక్కర్లేదు. లోపల ఏ మాత్రం వెలితి, రోత, అశాంతి ఉన్నా, ప్రకృతి మనలను విడిచిపెట్టదు.

- **<u>లోకంలోని భోగాలు ఆకర్షణల నుండి ఎలా బయట పడాలి?</u>**

✓ సత్పురుష సహవాసం, సత్ గ్రంథ పఠనం, దైవం యొక్క కటాక్షం ఇవన్నీలేకుండా మనిషి లోకంలోని ఆకర్షణల నుండి బయటకు రాలేడు. అందుకే భగవంతుడు చెప్పాడు: ' నా మాయను జయించడం కష్టం కానీ నా పాదాలను ఆశ్రయించిన వారు నన్ను చేరుకుంటారు'.

- **<u>అవతార పురుషుడిని అందరూ గుర్తించగలరా?</u>**

✓ జ్ఞానం తాలూకు వైభవం లేనివారు, సాధర సంస్కారం లేనివారు, సహృదయం లేనివారు, సద్బుద్ధి లేనివారు ఒక అవతార పురుషుడు భూమి మీదకు వచ్చినా గుర్తించలేరు. కృష్ణుడు దేవుడని భీష్మునికే తెలుసు, దుర్యోధనుడికి తెలియదు. గణపతి ముని అన్నారు: 'రమణ మహర్షిని దర్శించడం వల్ల కోరికలు నెరవేరుతాయని, లేక పుణ్యం వస్తుందని అందరూ వచ్చేవారే కాని, ఆయన స్కందావతారం అని, మహాజ్ఞాని అని చాలా కొద్దిమందికే తెలుసు.

- **<u>గోవిందుడు ఇచ్చే శాంతి మన బుద్ధికి అందుతుందా?</u>**

✓ గోవిందుడు ఏమి అన్నాడు అంటే: నా అనుగ్రహం వల్ల మీకు శాంతి కలుగుతుంది. ఆ శాంతి మీకు వచ్చాక 'ఏంటి నాకు ఇంత శాంతి కల్గుతుంది?' అని మిమ్మల్ని చూసి మీరే ఆశ్చర్యపడతారు. ఈ శాంతి ఎక్కడనుంచి వస్తుందని ఆలోచన మొదలెడతారు.  మీరు ఆలోచించినా మీ ఆలోచనకు అందదు. నేనిచ్చే శాంతి – it is beyond your understanding, it is beyond your intellect, it is beyond your discrimination.

- **<u>గురువు చేసే పని:</u>**

✓ గురువు, ఆత్మ, ఈశ్వరుడు మూడూ ఒక్కటే. మనకు రాబోయే తలంపు గురువుకు ముందే తెలుసు. ఎందుకంటే గురువు ఆత్మ అయి ఉన్నాడు. ఆత్మానుభవానికి ఏ అలవాట్లు, బలహీనతలు,

attractions, temptations అడ్డు వస్తున్నాయో అవి నీకు చూపిస్తాడు. అంతేకాదు ఆ బలహీనత లోనుంచి బయటపడాలి అనే బుద్ధి కలుగచేసి, వాటినుండి బయట పడేస్తాడు. గురువు చేసే పని బయట 1% ఉంటే లోపల 99% ఉంది.

- **<u>భగవాన్ ఎందుకు cruel లవర్?</u>**

✓ కొంతమంది దూరంగా ఉన్నా భగవాన్ వాళ్ళను పిలిచి ప్రేమతో మాట్లాడేవారు. దగ్గరే కూర్చున్న వారి ముఖం కూడా చూసేవారు కాదు. అప్పుడు వాళ్లకు ఒక మొట్టికాయ మొట్టాలి అన్నంత కోపం వచ్చేది. అలాంటివారు భగవాన్ను cruel లవర్ అని పిలిచేవారు. ఇవన్నీ మనలోపల ఉన్న వాసనలను కెలుకడానికి చేసే ప్రక్రియలు. మనకు ఎంత కోపం ఉందో చూపించడానికి చేసేవారు భగవాన్.

- **<u>కాలానికి లోబడి ఎవరు ఉంటారు, అతీతంగా ఎవరుంటారు?</u>**

✓ రోజుకు 24 గంటలు. మీరు కర్తృత్వం పెట్టుకుని పని చేస్తే గంటలో అలసిపోతారు. కర్తృత్వం లేకుండా 20 గంటలు పనిచేసినా మీరు అలసిపోరు. దేహం తాననుకునే వాడు 'ఒక కాలం లో ఉన్నాను ఇంకో కాలం లో లేను' అనుకుంటాడు. తనువు తాను కాదని తెలిసినవాడు, దేశానికి అతీతం, కాలానికి అతీతం.

- **<u>విషానికి విషయాలకు గల వ్యత్యాసం:</u>**

✓ విషాన్ని స్మరిస్తే చావము, తీసుకుంటే చస్తాము. కానీ విషయాలను లోపలికి తీసుకోనక్కర్లేదు, స్మరిస్తే చస్తాము. అంటే poison అయి మన మైండ్ కి పట్టేస్తుంది. విషము కేవలం దేహాన్ని చంపుతుంది కానీ విషయచింతన కొన్ని లక్షల జన్మలు తీసుకొస్తుంది. ఒకవేళ మీరు కష్టపడి జ్ఞానం సంపాదించుకున్నా, విషయచింతన జ్ఞానాన్ని నిలబడనివ్వదు, కాలప్రవాహంలో గెంటి బయటపడేస్తుంది.

- <u>**మాయ అంటే ఏమిటి?**</u>

✓ ఏది లేదో దాన్ని మాయ అంటారు. మనకు నూటికి నూరుపాళ్లు లేనిది నూటికి నూరుపాళ్లు ఉన్నట్లుగా కనిపిస్తుంది. అదే మాయ.

- <u>**ప్రాణాయామాలు ధ్యానాలను మించిన తపస్సు?**</u>

✓ మీ ఇంటి దగ్గర ఏదైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా, ఎవరైనా పీడిస్తున్నా- ఇవన్నీ రియాక్షన్ లేకుండా భరించకలుగుతూంటే, సహించకలుగుతూంటే, అది కూడా తపస్సే. ప్రాణాయామాలు, ధ్యానాలు కన్నా ఎక్కువ ఫలితం వస్తుంది.

- <u>**శివ పార్వతుల తత్త్వం:**</u>

✓ శివ పార్వతుల మధ్య బేధం చూస్తే మన నోట్లో మట్టిపడుతుంది.  శివ పార్వతులు ఎప్పటికీ సమానమే. శివుడు నిప్పు అయితే అందులోని వేడి పార్వతి.  వేడి లేకుండా నిప్పు ఎలా ఉండదో, పార్వతి లేకుండా శివుడు ఉండడు.

- <u>**ప్రతికూల పరిస్థితులను ఎలా ఎదురుకోవాలి?**</u>

✓ స్వీట్ తినేటప్పుడు మనం ఎంత ఇష్టంగా తింటామో, అలాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా, మనం వాటిని అంగీకరిస్తే, వచ్చే జన్మలో ఇటువంటి పరిస్థితులు రావు. ఇష్టంలేకుండా accept చేస్తే next జన్మలో ఇవ్వే పరిస్థితులు వస్తాయి. జరుగ వలసినది జరుగుతా ఉంటుంది. మీకు ఛాయస్ ఒక్కటే ఉంది: రియాక్ట్ అవ్వకుండా ఉండటమే. ఎప్పుడైతే మీరు రియాక్ట్ అవ్వకుండా ఉంటారో కొత్త వాసనలు రావు, పాత వాసనలు పోతాయి.

- **ఒక్కరిని సేవించినా అది ఎందుకు అద్భుత విషయం?**

✓ భగవంతుడే మనకు సృష్టి గా కనిపిస్తున్నాడు. అందుచేత మీరు ఎవరికీ సహాయ సహకారములు అందించినా, అది భగవంతునికే అందుతుంది. It is glorious to serve even one man. నీ శరీరం ఉన్నందుకు ఇంకొక శరీరానికి ఉపయోగపడు. అలాకాక పోతే కొబ్బరి చెట్లకి, తాడి చెట్లకి, నీకు తేడా ఏముంది?

- **చదువు ఉన్నవారిని శ్రీ రామకృష్ణులు లెక్కచేసేవారా?**

✓ రామకృష్ణుని కూడా వెళ్లిన భక్తులు: 'మీకు చదువు లేదు కాబట్టి ఆ చదువుకున్న వారి విలువ మీకు తెలియడంలేదు' అని అంటే, రామకృష్ణులు అనేవారు: ఆ చదువులన్నీ నేర్చుకుంటే వచ్చినవి. పుస్తకాలు చదివి ఇన్ఫర్మేషన్ సంపాదించారు. వారికి దేహబుద్ధి పోలేదు కదా'. 'వాళ్ళు బాగా ధనవంతులు లేక పండితులు కదా' అని అంటే 'అవన్నీ స్వప్న సమానం, స్టుపిడ్ స్టఫ్' అని అనేవారు శ్రీ రామకృష్ణులు.

- **మందాకినీ నదినీటిని రాముడు దేనితో పోల్చాడు?**

✓ మందాకినీ నదికి వరదలు రావు. మూడు కాలాల్లో సమానంగా ప్రవహిస్తుంది. రాముడు ఆ మందాకినీ నదిలో మూడుసార్లు స్నానం చేసేవాడు. ఒకసారి సీతమ్మ : 'ఈ నదిలో నీరు ఇంత స్వచ్ఛంగా ఉన్నాయేమిటి?' అని అంటే రాముడు అన్నాడు: 'అవును నిజమే. సత్పురుషుని హృదయంలా ఉన్నాయి'.

- **బుద్ధుడు ఎందుకు అతి పనికిరాదు అన్నాడు?**

✓ తరించేంతవరకు కూడా మధ్యేమార్గం అవలంబించండి, అతిగా వెళ్ళకండి. అది safeside. బుద్ధుడు అతిగా వెళ్లి దెబ్బలు తిన్నాడు. కొన్నాళ్ళు భోజనం పూర్తిగా మానేస్తే శరీరం చనిపోడానికి సిద్ధపడింది. అప్పుడు సుజాత అనే భక్తురాలు పాయసం పెట్టింది. ఆ అనుభవంతోనే బుద్ధుడు మీరంతా మధ్యేమార్గం

అవలంబించండి అని చెప్పాడు. 'ఎక్కువగా తినవద్దు. తక్కువగా తినవద్దు. మీ శరీరానికి ఎంత అవసరమో మీ శరీరమే చెబుతుంది' అని అన్నాడు బుద్ధుడు.

- **<u>గర్వం రాకుండా ఉండటానికి భగవద్గీతలోని మాట:</u>**

✓ కృష్ణుడు అన్నాడు: 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్', అంటే 'ఓ అర్జునా, యుద్ధం పేరు చెప్పి నీవు నిమిత్త మాత్రంగా కనిపిస్తా ఉండు. చేయవలసిన పని లేక సంహారం అంతా నేను పూర్తి చేసేస్తాను. నేను అందరిని చంపేసి ఉంచాను. నువ్వు చేతులు ఆడిస్తే సరిపోతుంది. పని నాది కీర్తి నీది'. అర్జునుడు అంటే తెల్లటివాడు లేక స్వచ్ఛమైనవాడు అని అర్థం. భారతదేశం లో పుట్టిన గొప్ప మాహావీరుడు. అటువంటి అర్జునుడిని నిమిత్తమాత్రంగా ఉండమంటే, మన సంగతి ఏమిటి?

- **<u>ఇతరులను judge చేసేవారి గురించి భగవాన్ అన్న మాట:</u>**

✓ భగవాన్ అన్నారు: కోర్ట్ లో మున్సాబ్లు జీతాలు పుచ్చుకొని judgments ఇస్తారు. వీడు మంచివాడు కాదు, వీడు మంచివాడు అనే తీర్పులు నీకెందుకు? జీతాలు లేకుండా ఈ తీర్పుల గొడవ నీకెందుకు?

- **<u>అజ్ఞానం అంటే ఏమిటి?</u>**

✓ లోపల ఉన్న ఆనందం నువ్వు బయట వెతుకుతూంటే దాన్ని అజ్ఞానం అనకపోతే ఇంకేమంటారు? పాలకొల్లులో పోగొట్టుకున్న వస్తువు అరుణాచలంలో వెతికితే దొరుకుతుందా? వస్తువు ఎక్కడ పోగొట్టుకుంటే అక్కడ వెతుకు; నాలుగు రోజులు ఆలస్యం అయినా దొరుకుతుంది.  హృదయం లో ఉన్న దానిని బయట వెతుకుతున్నారు. అది మీ అజ్ఞానానికి గుర్తు.

- **విశ్వనాథునితో ఆచార్యులవారు అనిన మాటలు:**

✓ 'నువ్వు నాకు ఏమీ ఇవ్వక్కర్లేదు. నేనే నీకు ఇస్తాను. నా మనస్సు కోతివంటిది. కోతి ఒక రొమ్మ నుండి ఇంకొక రొమ్మకు దూకినట్లు, నా మనస్సు కూడా ఒక తలంపుని విడిచి పెట్టేసి ఇంకొక తలంపు మీదకు వెళ్తుంది. ఈ మనస్సు అనే కోతిని నీవు తీసేసుకో. నీవు ఆదిభిక్షువు. నీ భిక్షాటనకు ఈ కోతి పనికి వస్తుంది. నాకు దరిద్రం వదులుతుంది'.

- **భగవాన్ మొదటి ఉపదేశం:**

✓ భగవాన్ ని ఇంటికి రమ్మని తల్లి అడిగితే, భగవాన్ అన్నారు: 'ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధం అనుసరించి ఆడిస్తున్నాడు. జరుగ వలసినది జరిగే తీరును. జరగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు. ఇది నిశ్చయం'. ఈ ఒక్క వాక్యం గుర్తుపెట్టుకోండి. మీకు బండెడు దుఃఖం ఉన్నా ఒక్క క్షణం లో ఆరిపోతుంది. ఇది నాలుగు వేదాల సారం.

- **సత్సంగ మహాత్మ్యం:**

✓ సత్పురుషులు అంటే సద్వస్తువు తోటి సంబంధం ఉన్నవారు. ఆ సత్పురుషులతోటి లేక సద్వస్తువు తెలుసుకోవాలనే కాంక్ష ఉన్నవారితో సాంగత్యం మంచిదే. నదిని దాటించటానికి నావ ఎటువంటిదో అలాగే సంసార సాగరాన్ని దాటించడానికి సత్సంగం కూడా అటువంటిదే. ఆచార్యులవారు అన్నారు: ఈ సత్సంగం కంటే విశేషమైనది విలువైనది మూడు లోకాలలో ఏదైనా ఉందా?

- **సత్పురుష సహవాసం దొరకనప్పుడు ఏమి చేయాలి?**

✓ 'మీరు సత్పురుషులను అన్వేషించమంటున్నారు కానీ మా చుట్టుప్రక్కల ఎవరూ లేరు, ఏమి చేయాలి?' అని ఒకరు బుద్ధుడిని ప్రశ్నిస్తే, బుద్ధుడు ఆటోమేటిక్ గా ఇలా చెప్పాడు: 'నీకు సత్పురుషులు

దొరకకపోతే అడవిలో ఏనుగులా ఒంటరిగా బతుకు'. అంటే సత్పురుష సహవాసం దొరకనప్పుడు ఏకాంతవాసం మంచిది.

- **<u>భార్య చనిపోయాక తిలక్ తన పిల్లలతో అన్నమాట:</u>**

✓ తిలక్ గారు మహాపండితుడు. భగవద్గీత మీద 1600 పేజీల వ్యాఖ్యానం రాసారు. తిలక్ జైల్లో ఉండగా అమ్మ చనిపోయింది అని పిల్లలు ఉత్తరం రాసారు. అప్పుడు తిలక్ తిరిగి ఇలా రాస్తారు: 'నేను ఇంటికి వచ్చాక తండ్రిగా చేసే పనే కాకుండా మీ అమ్మ చేసేపని కూడా చేసిపెడ్తాను'.

- **<u>శ్రీ రామకృష్ణులు కులానికి అతీతులు:</u>**

✓ ఒకరు శ్రీ రామకృష్ణులను ఇలా అడిగారు: 'మీరు బ్రాహ్మణులు, వివేకానందుడు రాజులు. మీరు బ్రాహ్మణులు అయి ఉండి బ్రాహ్మణులకే ట్రైనింగ్ ఇవ్వాలి కానీ రాజులకు ఎందుకు ఇస్తున్నారు?' అంటే శ్రీ రామకృష్ణులు ఇలా అన్నారు: 'వివేకానందుడికి ఉన్న సమగ్రత, కళ్యాణ గుణాలు గలవారిని బ్రాహ్మణులలో చూపించు. అప్పుడు తప్పక వారికి కూడా ట్రైనింగ్ ఇస్తాను'.

- **<u>శ్రవణం యొక్క ప్రాముఖ్యత:</u>**

✓ మీరు ఎవరైనా పెద్దలు చెబుతూంటే శ్రవణం చేయండి. అలా శ్రవణం చేయగా చేయగా మీ ఇంద్రియాలు మనస్సు శుద్ధి చేయబడుతాయి, మీకు జ్ఞానం పొందాలనే కాంక్ష ఉదయిస్తుంది. సూర్యుడు ఉదయించక ముందే వెలుతురు వస్తుంది. దాన్ని అరుణోదయం అంటారు. అలాగే మీరు శ్రద్దగా వినడం వలన జ్ఞానం వచ్చే సూచనలు తెసులుస్తూ ఉంటాయి. కొంతమంది శ్రవణం చేస్తే సరిపోతుందా అంటారు. శ్రవణం చేస్తే మనం ఆచరించ కలిగినది ఆచరిస్తాము, ఆచరించలేనిది ఆచరించ లేము. ఇలాగ పనికిరాని మాటలు భుజాన వేసుకొని తిరగకూడదు.

- **చూసుకునేవారు లేకపోతే మీరెందుకు అదృష్టవంతులు?**

✓ 'ఇంటికాడ మమ్మల్ని ఎవరూ చూడట్లేదు' అని కొంతమంది అంటూ ఉంటారు. వారు అదృష్టవంతులు. చూడకపోతే వాళ్ళమీద మమకారం ఏర్పడదు. ఎవరైనా బాగా చూస్తూంటే వాళ్ళ వలన బంధింపబడుతాము. మాట్లాడితే పది నమస్కారాలు, మాట్లాడకపోతే వంద నమస్కారాలు. ఏ కారణం వలన దుఃఖం లేక అశాంతి లేక భయం వస్తున్నా, అక్కడ బంధం ఉందని గుర్తు.

- **పాండురంగ విట్ఠల్ తో తుకారాం చేసిన ఛాలెంజ్:**

✓ తుకారాం అంటాడు: ' ఓ రంగా! ఓ పాండురంగా! నీ దగ్గర ఉన్న కష్టాలన్నీ నా చేత అనుభవింపచేసావు. నేనేమీ టైర్డ్ అయిపోలేదు. ఎందుకు ఇన్ని కష్టాలు పంపుతాడు అని నా మనస్సు ఎప్పుడూ రియాక్ట్ అవ్వలేదు. అదనంగా ఇంకా ఏవైనా కష్టాలు ఉంటే అవికూడా పంపేసేయి. వాటిని భరించే శక్తి నాకు ఉంది. నీ దగ్గర పంపడానికి ఇక కష్టాలు లేకపోతే, నీ చేతుల్లో నేను ఓడిపోవడం కాదు, నా చేతుల్లో నువ్వే ఓడిపోయావు'.

- **జరగవలసినది జరుగుతుంది కదా మరి ప్రయత్నమెందుకు?**

✓ జరగవలసినది జరుగుతుంది అనేది దేహానికి సంబందించినది మాత్రమే. దేహం ఏ రోజున ఎక్కడ ఉండాలి అనేది ప్రారబ్ధానికి వదిలేయండి. నీ మనస్సు అంతర్ముఖం అయితే, ఆ దేహ ప్రారబ్ధం ఎంత బలీయంగా ఉన్నా నిన్ను ప్రభావితం చేయదు. ప్రారబ్ధం అనేది దేహానికి సంబందించినది; పుట్టని వస్తువుకు ప్రారబ్ధం ఉండదు. పుట్టని వస్తువుగా ఉండటానికి ప్రయత్నం చేస్తే ప్రారబ్ధం ఏమీ చేయదు.

- **కేవలం బ్రహ్మచర్యం తో సెక్స్ భావన అధిగమించవచ్చా?**

✓ భగవాన్ అన్నారు: నువ్వు శరీరం అనుకున్నప్పుడు ఎదుటివారు కూడా శరీరం అనుకుంటావు. నేను పురుషుడను అని అనుకున్నప్పుడు, స్త్రీలు స్త్రీల కింద కనిపిస్తారు. ఈ స్త్రీ పురుష బేధం ఎక్కడ ఉంది?

శరీరంలో ఉంది. చైతన్యం లో సెక్స్ లేదు. బాహ్యంగా వివాహం చేసుకోకపోయినా, శరీర భావన ఉన్నంతకాలం, సెక్స్ భావన నుంచి బయటకు వచ్చాను అని అనుకోవద్దు.'

- **కేవలం అన్న పానాదుల తో శాంతిగా ఉండవచ్చా?**

✓ ఏసు అన్నాడు: 'మీకు అన్నానికి బట్టలకు నీడకు లోటులేకపోయినా సుఖంగా శాంతిగా జీవించగలరా? లేదు. ఎందుకంటే లోపల ఉన్న ఏదో ఒక వాసన మనిషి చనిపోయేంతవరకు పీడిస్తూ ఉంటుంది. శవాన్ని ఈడ్చినట్లు ఈడ్చేస్తుంది. ఏదో ఒక డివైన్ interference ఉంటే కానీ ఆ వాసన క్షీణించదు'. బుద్ధుడు అన్నాడు: 'జీవిత గమ్యం మోక్షం లేక నిర్వాణం కాదు, జీవిత గమ్యం వాసనా క్షయం'.

- **ఈశ్వరుడికి గురువుకి మధ్య తేడా?**

✓ ఈశ్వరుడు judge లాంటివాడు. మీరు చేసే పనులకు judgement రాస్తాడు. కానీ గురువు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. బ్రహ్మదేవుడు రాసింది తీసేయగలవాడు గురువు. యమధర్మరాజు తో పోరాడి భక్తులను రక్షించే స్వభావం ఈశ్వరుడిది కాదు గురువుది. గురువు అనే వాడు రక్షిస్తాడే గాని శిక్షించడు. ఈశ్వరుడు కూడా గురువు రూపంలో ఉన్నప్పుడే మిమ్మల్ని రక్షిస్తాడు.

- **మౌనం ఎందుకు బంగారం?**

✓ మౌనం అంటే మాటకు సంకల్పానికి మనస్సుకు అందదు. మౌనంలో దేవుడు లేడు, సృష్టి లేదు, చావు - పుట్టుకలు లేవు, ఇతరులు లేరు. మౌనంలో ఉండగా ఎవరితో ఎవరు మాట్లాడుతారు? మీ నోటినిండా అన్నం ముద్ద ఉన్నప్పుడు పక్కవారితో మీరు మాట్లాడగలరా? గొప్ప పోయెట్రీ గాని, గొప్ప గొప్ప సైంటిఫిక్ achievements గాని, మౌనంలో నుంచి వస్తాయి. మౌనానికి అలవాటు పడినవారు

మాత్రమే జీవితంలో మాధుర్యం కల్పించుకుంటారు. నిజమైన ఆప్యాయత కూడా మౌనం నుండే ప్రవహిస్తుంది.

- **<u>అరుణాచలంలో అశాంతి రావటానికి కారణం?</u>**

✓ చెరువులో బెడ్డవేస్తే గాని చెరువులో ఉన్న మురికి బయట పడుతుంది. రోగం ఉందని తెలిస్తే గాని మందులు వాడుతారు లేక సర్జరీ చేయించుకుంటారు. అరుణాచలేశ్వరుడు మన హృదయాన్ని కెలుకుతాడు, లోపల ఉన్న వాసనలను కదుపుతాడు. అప్పుడు ఆ వాసన తలంపు రూపంలో బయటకు వస్తుంది. మిమ్మల్ని బాధపెట్టడానికి చేయడు. ఆ వాసన ఉంది అని తెలియచేయడానికి చేస్తాడు. వాసన బ్రెయిన్ లోకి వచ్చినప్పుడు pain లేక అశాంతి కలుగుతుంది. అప్పుడు ఆ వాసన తొలగించుకోవాలనే బుద్ధి కలుగుతుంది.

- **<u>సద్వస్తువు గురించి ఆచార్యులవారి వివరణ:</u>**

✓ ఆ సద్వస్తువుకి పుట్టుక లేదు, చావు లేదు; అది లేని దేశకాలాలు లేవు. దాని స్వరూపం ఆనందం అయి ఉంది. అది అంతటా ఉంది, అన్ని కాలాల్లో ఉంది.  అది ఎవరు? అది నీవే. ఆ శాంతి, ఆనందం, అన్ని కాలాల్లో ఉన్నది, అన్ని దేశాల్లో ఉన్నది, ఎవరు? అది నీవై ఉన్నావు. అదే నీ హృదయం లో నిజం క్రింద కనిపిస్తుంది. మన కళ్ళకు కనిపించే ప్రకృతి సంబంధిత విషయాలకి, కళ్ళకు కనపడని ప్రకృతి సంబంధిత విషయాలకి, రెండిటికి అతీతంగా నువ్వు ఉన్నావు.

- **<u>ఏసు చెప్పిన అద్వైత మహామంత్రం:</u>**

✓ ఉండటమే ఆనందం, శాంతి, సుఖం. దేహం ఉన్నాలేకపోయినా, ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా, ఉన్నది అలా కంటిన్యూ అయిపోతుంది. దానికి ఏమి limitations లేవు. జీసస్ అన్నాడు: 'I AM THAT I AM, అంటే ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను'. ఇది రోజు మంత్రం లాగ అనుకోండి. జీసస్ ఇంకా ఇలా అన్నాడు: You must know the Truth and the Truth

only shall make you free. ఆ ఉన్నదేదో మీరు అనుభవం లోకి తెచ్చుకోవాలి. ఆ రోజే మీకు పునర్జన్మల నుంచి, నాన్సెన్స్ నుంచి, ప్రకృతి నుంచి, habits నుంచి, subtle బాడీ నుంచి, గ్రాస్ బాడీ నుంచి, మీరు కానీ వాటి నుంచి విడుదల పొందుతారు. అదే ఫ్రీడమ్ from rebirth, delusion, and everything that is nonsense.

- **గీతా సందేశం:**

✓ మీరు చేసే పనులు ఇష్టంతో చేయండి. Be positive, don't be negative. మీరు ఏమీ కష్టపడకుండానే లిబరేషన్ వచ్చేస్తుంది. ఏ పని చేసినా దేహ ప్రారబ్ధం లో ఉంది కాబట్టి, ఇష్టం లేకుండా చేయకండి, ఇష్టంతో చేయండి. In everything be positive - this is the message of Bhagavat Geetha.

- **గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు కోరికలు కోరవచ్చునా?**

✓ మీరు కోరికల గొడవ లేకుండా, సంకల్పాలు లేకుండా, శాంతిగా, స్లోగా, అణ్ణామలైని స్మరించుకుంటూ గిరిప్రదక్షిణ చేస్తే మీ అన్నీ కోరికలు నెరవేరుతాయి, మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు అరుణాచలేశ్వరుడు. అయితే మనం తెలియకుండా కోరేసుకుంటున్నాము. మీరు కోరుకుంటే ఆయన దయ, అనుగ్రహం, ఆ ఒక్క కోరికకే పరిమితం అవుతుంది. కానీ ఏ కోరికలు లేకుండా ఉంటే, మీకు తెలియని కోరికలు కూడా నెరవేరుతాయి. అదేకాక మీకు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు అరుణాచలేశ్వరుడు.

- **పని ఎలా చేస్తే అది యోగం అవుతుంది?**

✓ చేసే పని నేర్పుగా, స్కిల్ గా చేస్తే అదికూడా యోగం తో సమానము. అది కూడా నిన్ను భగవంతునిలో ఐక్యం చేయడానికి సహకరిస్తుంది. అంటే విసుగులేకుండా నీట్ గా చేయాలి. యోగ:

కర్మ సుకౌశలం. ఈ పని, ఆ పని అని ఏమి లేదు. మీ చేతులో ఉన్న పని నీట్ గా చేయాలి. అది యోగం.

- **<u>కృష్ణుడికి ఎవరు అత్యంత ప్రీతిపాత్రులు?</u>**

✓ భగవద్గీతలో కృష్ణుడు అన్నాడు: 'ఓ అర్జునా! నీకు నాకు మధ్య జరిగిన ఈ సంభాషణను ఎవరైతే అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఎంజాయ్ చేసి, ఇతరులకు బోధిస్తారో వారు నా హృదయానికి అత్యంత ప్రీతిపాత్రులు'. కృష్ణుడి మాటలు ఎంజాయ్ చేస్తే లోకం లో ఉన్న enjoyments మీద ఆసక్తి తగ్గుతుంది.

- **<u>మాటలతో సత్యాన్ని వర్ణించవచ్చా?</u>**

✓ బుద్ధుడు అన్నాడు: Truth is beyond duality and relativity. సాపేక్షిక పదాలతోటి (మంచి-చెడ్డ, పుణ్యం-పాపం), లేక ద్వైతానికి సంబంధించిన మాటలతోటి ఆ దుఃఖం లేని స్థితిని, ఆనంద స్థితిని వర్ణించలేము. పంచదార నీ చేతుల్లో ఉంటే, అది ఎలా ఉంటుంది అని ఎవరినీ అడుగక్కర్లేదు; నోట్లో పోసుకుంటే నీకే తెలుస్తుంది. అలాగే ముందు truth ని attain చేయి. Attain చేయకుండా truth ఎలా ఉంటుంది అని ఇతరులను అడగకు.

- **<u>ఎవరు భగవాన్ సబ్జెక్టు కి వారసులు?</u>**

✓ భగవాన్ అన్నారు: 'నేను చెప్పే ఈ సబ్జెక్టు కి ఈ హాల్లో కూర్చున్న నలుగురే వారసులు కాదు. సహృదయం ఉన్న వాడు సృష్టిలో ఎక్కడ ఉన్నా, వాడు నా టీచింగ్ కి వారసుడు'. అక్కడ పెట్టుబడి ఏమిటంటే సహృదయం. అంటే సహృదయం ఉండాలి, సద్బుద్ధి ఉండాలి, ఆ మనిషి ఉత్తమోత్తముడు అయి ఉండాలి, సరళ హృదయం ఉండాలి, శాంత చిత్తం కలిగి ఉండాలి.

- **<u>యోగి రామయ్య వివరించిన భగవాన్ ప్రత్యేకత:</u>**

✓ గాంధీగారు ఒకసారి యోగి రామయ్యను ఇలా అడిగారు: 'అందరి హృదయాలలో ఏదైతే ఉందో భగవాన్ హృదయంలో కూడా అదే ఉంది కదా. మరి భగవాన్ లో ఉన్న ప్రత్యేకత ఏమిటి?' అంటే యోగి రామయ్యగారు ఇలా అన్నారు: 'భగవాన్ కు తన హృదయంలో ఉన్న నిజం అనుభవంలో ఉంది, మనకు మన హృదయం లో ఉన్న నిజం అనుభవం లో లేదు. అంతే తేడా'.

- **<u>భగవాన్ ఆఖరి క్షణాల అద్భుత వివరణ:</u>**

✓ భగవాన్ మహానిర్యాణ సమయంలో భక్తులు queue కట్టి భగవాన్ని దర్శించారు. తెలుసున్నవారు కనిపిస్తే భగవాన్ ఒక చిరునవ్వు నవ్వే వారు. అది లాస్ట్ స్మైల్. కొంతమంది తో మాట్లాడకపోయినా ఊరికే అలా చూసేవారు. అది లాస్ట్ లుక్. మరీ ఇష్టమైన వారు కనిపిస్తే అప్పుడు కళ్ళేమట నీరు పెట్టుకునేవారు భగవాన్. అవి లాస్ట్ టియర్స్.

- **<u>కృష్ణుడు చనిపోయాక ధర్మరాజుతో అర్జునుడు అనిన మాట:</u>**

✓ కృష్ణుడు చనిపోయాక, ధర్మరాజుతో అర్జునుడు: మన దేవుడు చనిపోయాడు అని అనడు; మన అమ్మ చనిపోయింది అని అంటాడు. అర్జునుడి ఉద్దేశ్యం ఏమిటంటే కృష్ణుడు ప్రజలకు దేవుడు అవ్వొచ్చు కానీ మనకు అమ్మే.

- **<u>భగవాన్ యొక్క యుక్తిపూరిత సమాధానం:</u>**

✓ ప్రపంచము సత్యమా అసత్యమా అని అడిగితే భగవాన్ అన్నారు: 'ప్రపంచము సత్యము వలె కనిపిస్తుంది'. ఇక్కడ భగవాన్ యొక్క లౌక్యం చూడండి. సత్యము అని చెప్పలేదు, అసత్యము అని చెప్పలేదు. దీనినే tact అని అంటారు.

- **<u>విధి బలీయమైనది అనుటకు ఉదాహరణ:</u>**

✓ ప్రపంచము లో జరగవలసిన సంఘటనలు అలా జరిగిపోతూ ఉంటాయి. ఏ సంఘటనను మనం ఆపుచేయలేము. ఇదే భగవాన్ చెబుతూ ఉండేవారు: 'అలా జరగ వలసినది జరిగింది అంతే'. ఇందిరా గాంధీ చనిపోయే ముందు సిక్కులను రక్షణ కోసం పెట్టుకోవద్దని చాలామంది సలహా ఇచ్చారు. కానీ ఇందిరా గాంధీ 'నేను సిక్కులను దూరం చేసుకోలేను' అంటూ ఏదో ఆదర్శాలు మాట్లాడింది. విధి చాలా బలీయమైనది. చివరకు రక్షణ కోసం పెట్టుకున్న సిక్కులే ఆవిడను కాల్చి చంపేశారు. అంటే భగవంతుడు విననివ్వడు. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది. ఇది తెలుసుకోవడమే కావాలి. తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం.

- **<u>ఏ మూడు లేకపోతే నిజమైన సుఖం తెలుస్తుంది?</u>**

✓ మూడు కాలాలు (past, present, future) లేవు. మూడు అవస్థలు (వేకింగ్, డ్రీం, డీప్ స్లీప్) లేవు. మూడు కర్మలు (ప్రారబ్ధం, ఆగామి, సంచితం)లేవు. ఇవన్నీ మన మీద కల్పింపబడ్డాయి. కల్పింపపడినవి అన్నీ కల్పించినట్లు మనచేత గుర్తింపబడితే, ఏ వస్తువు మీద కల్పించబడ్డాయో ఆ వస్తువు మనకు ఎరుకలోకి వస్తుంది. అసత్యం అసత్యంగా కనిపిస్తే మీరు మిగులుతారు. అసత్యం అదృశ్యం అవుతుంది. అప్పుడు శాంతి ప్రవాహం లో, ఆనంద ప్రవాహం లో మీరు కొట్టుకుపోతారు. అది పరమస్థితి.

- **<u>ద్రౌపదిని కాపాడుటకు కృష్ణుడికి ఎందుకు ఆలస్యమైంది?</u>**

✓ ద్రౌపది కృష్ణుడిని అడిగింది: ' కౌరవ సభలో నన్ను వివస్త్రం చేసేటప్పుడు నేను నిన్ను ప్రార్థించాను, కానీ నువ్వు రావడం delay చేసావేమిటి?' అంటే కృష్ణుడు అన్నాడు: ' నువ్వు హృదయవాసి కృష్ణ అని పిలవలేదు. ద్వారకవాసి కృష్ణ అని పిలిచావు. మరి ద్వారాక నుంచి రావడానికి టైం పడుతుంది కదా? నన్ను తప్పు అంటావేమిటి? నీ పిలుపులోనే తప్పుంది'.

- **మనస్సుకి స్థిరత్వం ఎందుకు ఉండదు?**

✓ బ్రెయిన్ లో ఏకాగ్రత లేకపోతే స్థిరత్వం రాదు. మైండ్ wandering తగ్గాలంటే concentration ఉండాలి. Power of concentration is the only key to the treasure-house of knowledge. ఇనప్పెట్టలో డబ్బు తీసుకోవాలంటే నీ చేతిలో తాళం చెవి ఉండాలి. అలాగే నీ హృదయంలో knowledge నీకు ఓపెన్ అవ్వాలి అంటే నీ మైండ్ కి purity & concentration ఉండాలి.

- **అరుణాచలేశ్వరుడిని చమత్కారంగా తిట్టడం:**

✓ ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు కాముడిని జయించావని పురాణాల్లో రాసారు. మరి మేము నీ భక్తులం. మాకేమో కామం పీడిస్తుంది. నిన్ను ఆరాదిస్తూంటే మాకు కూడా కామం ఉండకూడదు కదా. నువ్వు కామం జయించిన వాడివైతే మాచేత కూడా కామాన్ని జయింపచేయాలి కదా? అలా చేయలేక పోతున్నావు అంటే నీకు కూడా కామం ఉందనా అర్థం?

- **భగవాన్ టీచింగ్ విశిష్టత:**

✓ భగవాన్ చెప్పింది pure అద్వైతం. అద్వైతం కంటే ద్వైతం తియ్యగా ఉంటుంది. మీకు నచ్చినా నచ్చక పోయినా, మీకు అర్థం అయినా అర్థం కాక పోయినా, భగవాన్ చెప్పిన ప్రతీ వాక్యం విడదీసి చదువుకోండి. భగవాన్ ఏ వాక్యం చెప్పినా that is final, that is ultimate, that is last word in metaphysics.

- **ఇతరుల గొడవల్లోకి ఎందుకు వెళ్ళకూడదు?**

✓ భగవాన్ అన్నారు: 'సాధ్యమైనంత వరకు ఇతరుల గొడవల్లోకి వెళ్ళకూడదు. ఇతరుల గొడవల్లోకి వెళ్లే కొలది మనకు ego-sense పెరుగుతుంది'. ఇతరులు అంటే ఎవరు? వాళ్ళ అహంకారం. ఆ ఇతరులు

అనే వారు ఏమైనా జ్ఞానియా? వారు బ్రాహ్మి స్థితి పొందారా? వారికి ఆత్మానుభవం ఏమైనా ఉందా? వారికి ఏదైనా దైవీ సంపద ఉందా?

- **<u>Otherness లేకపోతే కలిగే అనుభూతి:</u>**

✓ ఇతరులు అనేది ఎవరూ లేరు అనుకో నీకు అనుభవంలోకి వచ్చేది ఇది: సత్యం, జ్ఞానం, శివమ్, అనంతం, అద్వైతం. అద్వైతానుభవమే అమృతానుభవం. అద్వైతానుభవం పొందినవారికి ఇతరులు ఎక్కడ ఉన్నారు? అద్వైతం అంటే రెండు లేనిది.

- **<u>గౌడపాదుని అద్వైత సిద్ధాంతం:</u>**

✓ అద్వైతం అనే మాట ఉపనిషద్ లో వచ్చింది. దానినే గౌడపాదుడు సాగదీసి వివరించాడు. ఏదీ పుట్టడం లేదు, ఏదీ చావడం లేదు. బర్త్ అనేదే లేదు; డెత్ అనేదే లేదు. పుట్టుక అనేది లేకుండా నువ్వు ఎలా పుడుతావు? చావు అనేదే లేకుండా నువ్వు ఎలా చస్తావు? దీని అర్థం ఏమిటంటే బ్రహ్మం ఒక్కటే. బ్రహ్మం కి బర్త్ లేదు, డెత్ లేదు. అద్వైతం అంటే అదే. మనం కూర్చోవడం మాట్లాడుకోవడం ఇదంతా డ్రీం స్టఫ్.

- **<u>ఫైనల్ స్టేట్ కి ultimate స్టేట్ కి తేడా?</u>**

✓ ఇతరులు కనపడని అనుభవం మీకు కలిగితే, ఆ రోజులోనే, ఆ గంటలోనే, happiness లేక bliss వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. అది final స్టేట్ కాదు. మొదలు ఉంటే చివర వస్తుంది, చివర ఉంటే మొదలు వస్తుంది. అది ultimate స్టేట్. దానికి మొదలు లేదు, చివర లేదు. ఆ స్టేట్ మీరు పొందినప్పుడు ముగింపులేని శాంతిలో ఊగిసలాడుతారు.

- **<u>సత్త్వ గుణం ప్రాముఖ్యత:</u>**

✓ సత్త్వ గుణం వలన దైవీ చింతన పెరుగుతుంది. ఎవరైతే సత్త్వ గుణం పెంచి పోషించుకుంటున్నారో వారికి భగవదానుభవం కలుగుతుంది. ఎందుకంటే సత్త్వ గుణం భగవంతుని దగ్గరికి వెళ్ళడానికి ఒక రోడ్ వంటిది. అది భగవంతుని పాదాలు పట్టి ఇస్తుంది. సత్త్వ గుణం వచ్చినప్పుడు దాన్ని ప్రాక్టీస్ చేసి అది ఎక్కువ కాలం మనస్సులో ఉండేటట్లు చూసుకోవాలి. సత్త్వ గుణం ఉన్నవాడి మాటే ఇతరులను ప్రభావితం చేస్తుంది, రజోగుణం తమోగుణం ఉన్నవారి మాటలు కాదు.

- **<u>సాధన ఎంతచేసారు అంటే నాన్నగారి సమాధానం:</u>**

✓ మీరు ఏ ఏ సాధనలు చేశారు, హిమాలయ పర్వతాలకు వెళ్ళారా? అని అడిగితే నాన్నగారు అన్నారు: దత్తుడు సాధన ఏమి చేస్తాడు? నేను భగవంతుడికి దత్తుడు లాంటి వాడిని. సొంతంగా సంపాదించేవారు కష్టపడాల్సిన అవసరం ఉంది. కానీ దత్తత ఆస్తి కలిసి వచ్చిన వారికి పెద్దగా కష్టపడవలసిన అవసరం లేదు. కనుక నేనేమీ సాధనలు చేయలేదు.

- **<u>సొంత బుద్ధి ఎందుకు అవసరం?</u>**

✓ మీరు ఎత్తువారి చేతిబిడ్డల కింద ఉండకండి. భగవంతుడు లేడని ఎవరైనా చెబితే వారి చంక ఎక్కి కూర్చోకండి. మీరు సొంతంగా, స్వతంత్రంగా ఆలోచించుకోండి. మీకు భగవంతుడు చేతులు కాళ్ళు ఎలా ఇచ్చాడో, బుద్ధి కూడా అలా ఇచ్చాడు. ఆ బుద్ధి ఎందుకు ఇచ్చాడు అంటే ఆలోచించుకోడానికి ఇచ్చాడు. అందుచేత మీ సొంత బుద్ధి ఉండగా పరాయి బుద్ధి మీద ఆధార పడకండి. మీ సొంత బుద్ధి ఎంత దూరం తీసుకెళ్తే అంత దూరం వెళ్లి, తర్వాత మీ విశ్వాసం మీద ఆధారపడండి.

- **<u>కృష్ణుడు భగవద్గీత లో చేసిన వాగ్దానం:</u>**

✓ కృష్ణుడు అనుకుంటే భగవంతుడు కాదు, స్వయంగా భగవంతుడు. గీతలో ఆయన చేసిన వాగ్ధానం: 'బుద్ధియోగం దదామి. అంటే నీకు నా పట్ల ఉన్న విశ్వాసం లాయల్ అయితే, నీకు ఆత్మ జ్ఞానం

ప్రసాదించే బుద్ధిని, పరమ శాంతితో కూడిన బుద్ధిని, నేను నీకు ప్రసాదిస్తాను'. అందుచేత ఈశ్వరుని పట్ల భక్తి విశ్వాసాలు పెంచుకోండి. అప్పుడు ఇహమూ పరమూ రెండూ సమకూరుతాయి.

- **<u>సత్పురుష సహవాస ప్రభావం ఎటువంటిది?</u>**

✓ సత్పురుషులు వండటం వడ్డించడమే కాదు, మనకు నోట్లో ముద్ద కూడా పెడుతారు. కానీ మింగటం అనే పని మనం చేయాలి. పూర్వజన్మ సుకృతంబట్టి మనకు సత్పురుష సహవాసం లభిస్తే పూజలు జపాలు వంటి నియమాలతో పనిలేదు, మన సాధనలు అన్నీ రెండో పక్షం అవుతాయి. అంటే సహజంగా గాలి వీస్తూంటే విసన కర్రతో పనేముంది? గంగా జలము వలన పాపం, వెన్నెల వలన తాపం, కల్పవృక్షం వలన దారిద్ర్యం పోతాయి అని అంటారు. కానీ సత్పురుష సహవాసం లో సహజంగానే ఇవన్నీ పోతాయి.

- **<u>జ్ఞాని యొక్క మౌనం ఎందుకు ఉత్తమోత్తమం?</u>**

✓ జ్ఞాని యొక్క మౌనం అద్భుతం, అపూర్వం, ఉదార్తం. జ్ఞాని యొక్క మౌనం లో మీకు మారు మనస్సు కల్గుతుంది, మీ హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. ఆ మౌన దీక్షలో జ్ఞాని యొక్క చూడటం, తాకడం, బోధించడం అన్నీ కలిసిపోయి ఉన్నాయి. అందుకే జ్ఞాని యొక్క మౌనం ఉత్తమోత్తమం.

- **<u>తానీషా కు రాముడు నిజంగా కనిపించాడా?</u>**

✓ కొంతమంది హేతువాదులు అంటారు: 'రాముడు కనిపించి చెప్పినందుకే తానీషా రామదాసును విడిచి పెట్టాడు అని అంటారు కదా. అది వాస్తవం కాదు, కేవలం స్వప్న ప్రభావమే'. మరి అది కేవలం స్వప్నం అయితే ఎదురుంగా రామముద్రిత నాణాలు కనిపిస్తున్నాయి కదా. అదీ స్వప్నమేనా? దీనికి ఆ హేతువాదులు సమాధానం చెప్పరు.

- **<u>భజగోవిందం లో శంకరాచార్యులవారు చెప్పిన మాట:</u>**

✓ శంకరాచార్యులవారు భజగోవిందం లో చెప్పారు: 'భగవద్గీతను, విష్ణు సహస్రనామాలను విడిచిపెట్టకండి. శ్రీపతి రూపాన్ని ధ్యానం చేసుకోండి. శ్రీపతి మాటలను వినండి. భగవంతుడు మీకు ఐశ్వర్యం ఇస్తే లేనివారికి నాలుగు రూపాయలు పెట్టుకోండి. లోకంలో ఉన్న ఆకర్షణలు చూసి మోహపడకండి. అప్పుడు మీరు తరిస్తారు'.

- **<u>పని చేయాలా, చేస్తే ఎలా చేయాలి?</u>**

✓ ఆచార్యులవారు అన్నారు: 'మీరు పని చేయండి. పనిలేని జీవితం కూడా ఒక జీవితమేనా? మీరు ఓపిక ఉండి పనిదొంగలుగా ఉండొద్దు. ఓపిక ఉన్నంత సేపు పని చేయండి. మీకు చేతనైతే ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడండి. ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి పెట్టుకుంటే అశాంతి వస్తుంది. వచ్చేది ఏదో వస్తుంది, రానిదేదో రాదు. నువ్వు కష్టపడితే నీ ఫలితం భగవంతునికి అక్కర్లేదు. నీది నీకే ఇచ్చేస్తాడు. ఎవరికైనా ఏదైనా చేస్తే ఎవరికో చేసాను అనుకోకు. అది నీకే తిరిగి వచ్చేస్తుంది'.

- **<u>యమధర్మరాజుకు నచికేతుని సమాధానం:</u>**

✓ యమధర్మరాజు నచికేతుని తో అంటాడు: ' నీకు ఏది కావాలంటే అది ఇస్తాను కానీ ఆత్మ జ్ఞానం గురించి అడగకు'. అంటే నచికేతుడు అంటాడు: ' నువ్వు ఆస్తులు ఇచ్చినా, ఏనుగులు ఇచ్చినా, ఏది ఇచ్చినా అవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుపోతాయి కదా. కాలప్రవాహం లో కొట్టుకుపోయేవి నాకెందుకు? కాలానికి, దేశానికి, మరణానికి, ఏ జ్ఞానం అతీతంగా ఉందో దానిని ప్రసాదించు.'

- **<u>భగవంతుని అనుగ్రహం ఎలా పొందాలి?</u>**

✓ రామకృష్ణుడు అన్నాడు: 'మీరెంత, మీ బుద్ధి ఎంత, మీ మనస్సెంత, మీ తెలివితేటలు ఎంత? ఈ గోడ పక్కన ఏముందో తెలియదు, అవ్వేమి తెలివితేటలు? మీ బుద్ధి తోటి ఎంత విచారణ చేయగలరు?

ధ్యానం చేసేస్తున్నాం అంటారు. దేనిని ధ్యానం చేస్తున్నారు? గడియారాన్నా? అందుకే ఆయన దయ ఉండాలి. ఆయన దయ ఎలా వస్తుంది? మీ దైనందిన జీవితంలోని ప్రవర్తన బట్టి వస్తుంది. ఆయన అనుగ్రహం లేకుండా ఆయన స్వరూపం మీరూపొందలేరు'.

- **<u>కాశీలోని గంగా నది ప్రత్యేకత:</u>**

✓ గంగా నది ఉట్టి కాశీలో లేదు. గంగోత్రిలో పుట్టి సముద్రం లో కలిసేంతవరకు ఎన్నో ప్రదేశాల్లో ప్రవహిస్తుంది. అయినా కాశీలో గంగా నదికి ప్రత్యేకత ఉంది. అది ఏమిటంటే ఉత్తరాన ఉన్న హిమాలయ పర్వతాల్లో పుట్టిన గంగా నది, కాశీలో ఉత్తర దిశాన ప్రవహిస్తుంది. అందుకే ఉత్తరవాహిని అని పిలుస్తారు. అలాగే మీ మనస్సు ఏ సోర్స్ నుండి వస్తుందో ఆ సోర్స్ లోకి ప్రయాణం చేయండి. దీనినే 'swim like a fish against the mental current' అని అంటారు. అలా మనస్సు తన మూలం తెలుసుకొన్న మరుక్షణం మీ పునర్జన్మ కారణాలు మాయం అవుతాయి.

- **<u>బ్రహ్మ భూయాయ కల్పతే అంటే ఏమిటి?</u>**

✓ కొంతమంది నేను నాది అనే పదాలు నీళ్ళకన్నా ఎక్కువగా ఉపయోగిస్తారు. వాటి వాడకం తగ్గించాలి. బ్రహ్మ భూయాయ కల్పతే అంటే నేను అనే తలంపు, నాది అనే తలంపు, slow గా steady గా తగ్గించుకుంటూ వస్తే, బ్రహ్మం లో మీరు ఐక్యం అవుతారు. That is ultimate Truth, that is final, that is supreme.

- **<u>వర్తమాన కాలం సద్వినియోగ పరచడానికి రహస్యం:</u>**

✓ రేపు ఎలా ఉంటుందో చెప్పలేము. ఈ రోజును మీరు జాగ్రత్తగా ఉపయోగించుకోండి. డబ్బు లేక బంగారం పోతే సంపాదించగలం. కానీ కాలం పోతే అది మనకు తిరిగి రాదు. 60 సంవత్సరాలు వచ్చినవాడికి తిరిగి 30 సంవత్సారాల వయస్సు రమ్మంటే రాదు. వర్తమాన కాలం సద్వినియోగం

చేసుకోవాలి అంటే మీరు భూతకాలానికి పూర్తిగా చచ్చిపోవాలి. Dead to the past అంటే జరిగి పోయిన గొడవలకు పూర్తిగా చచ్చిపోండి. అప్పుడు మీ చైతన్యస్థాయి పెరిగి దుఃఖం తగ్గిపోతుంది.

- **<u>అద్వైతానుభవం వలన కలిగే లాభం:</u>**

✓ మీ జీవిత లక్ష్యం అద్వైతానుభవం, అంటే ఈశ్వరుని తోటి oneness. ఆ oneness మీరు పొందారా, మీకు పూజల తోనిగాని, యాత్రల తోనిగాని పనిలేదు. ఎంతపెద్ద గడ్డిమేటు అయినా అగ్గిపుల్లకు లోకువ. ఎంత పెద్ద గుమ్మడికాయ అయినా కత్తిపీటకు లోకువ. అలాగే మీరు ఒక్క నిమిషమైనా ఆ అద్వైతానుభవం పొందితే పూర్వ జన్మల్లో చేసిన మహాపాతకాలు కాలి బూడిద అయిపోతాయి.

- **<u>శివరాత్రి జరుపుటకు కారణం:</u>**

✓ అమృతం కోసం పాలసముద్రం చిలికినప్పుడు హాలాహలవిషం ఉద్భవిస్తుంది. దానిని చూసి దేవతలు రాక్షసులు పారిపోతూంటే, శివుడు ఆ హాలాహలమును మింగేశాడు. మింగేసి పొట్టలోకి వెళ్లనివ్వలేదు, లోకాలు నాశనం అవుతాయని బయటకు కక్కలేదు. కంఠములో పెట్టుకుని నీలకంఠుడు అయ్యాడు.ఆ గుర్తు కోసమే దేవతలు రాక్షసులు శివుడిని పూజించిన రోజు శివ రాత్రి అని కొంతమంది అంటారు. కానీ సంప్రదాయానుసారం లింగోద్భవం జరిగిన రోజు శివరాత్రి. శివుడు రాత్రి వేళ లింగరూపం ఎందుకు ధరించాడు అంటే మనలను అజ్ఞానం అనే చీకటి నుంచి జ్ఞానం అనే వెలుగులోకి మేలుకొల్పడానికి.

- **<u>పనిలేని వారి గురించి పుట్టిన సామెతలు:</u>**

✓ ఏ పాటు లేకపోయినా సాపాటు తప్పదు. మీరు ఏ పెళ్ళికి వెళ్లినా, పనిచేసేవారు చివరన తింటారు, పనిలేని వారు తినడానికి ముందుపంక్తి లో కూర్చుంటారు. అటువంటివారు పనికి పరారు, తిండికి తయారు అనే సామెత వచ్చింది. వారు అరకలు కడతారు అంటే దూడల్లో కలిసిపోతారు, తిండి పెడతారు అంటే దున్నపోతుల్లో కలిసిపోతారు.

- **<u>మంచి నౌకరు చెడ్డ యజమాని ఎవరు?</u>**

✓ మనస్సు ఎటువంటిది అంటే మంచి నౌకరు చెడ్డ యజమాని. మనస్సుకి రెండు లక్షణాలు ఉన్నాయి. నౌకరుగా ఉంచితే చాకిరీ చేసి పెడుతుంది. దానిని యజమానిగా చేస్తే మాత్రం తొక్కేస్తుంది. మనస్సు బుద్ధికి నౌకరులాగ ఉండాలి. అటువంటి మనస్సు ఉపకారం చేస్తుంది. అలాకాకుండా మనస్సు బుద్ధికి యజమాని అయితే, అంటే మనస్సు చెప్పినట్లు బుద్ధి వింటే, మనం పాతాళ లోకానికి పోతాము. ఆ మనిషికి ఇహం లేదు, పరం లేదు.

- **<u>న్యూస్పేపర్ లో తన పేరు చూసి శ్రీ రామకృష్ణులు ఏమన్నారు?</u>**

✓ శ్రీ రామకృష్ణుల పేరు న్యూస్పేపర్, పుస్తకాల్లో రాసినందుకు ఇలా అన్నారు: నాకు చదువు రాదు. అయినా పేపర్ లో, పుస్తకాల్లో నా పేరు ఎందుకు వేస్తున్నారు? ఈ ప్రజలందరూ అంటే ఈ cheaters అండ్ creatures, వీళ్లా నన్ను మహాత్మునిగా చేసేది? There is ఈశ్వర. భగవంతునికి నన్ను గొప్పవాడిగా చేయాలి అని ఉంటే ఎంతమందికి అసూయ ఉన్నా అది ఆపు చేయలేరు.

- **<u>వాదనలో ఓడించడానికి శంకరునికి కలిగిన గుణాలు:</u>**

✓ శంకరుడికి గాలివాన అని పేరు పెడుదాము. ఏ వేదాన్ని quote చేస్తాడో తెలియదు. ఆయన చెప్పిందల్లా ఎందుకు చెల్లింది అంటే ఆయనకు వస్తువు చేతిలో ఉంది. ఎదుటివారి తోటి మాట్లాడేటప్పుడు, ఆయనకు ఈ మూడు ఉన్నాయి - ఒకటి శృతి: అంటే వేదం. చెప్పినదానికి శాస్త్రప్రమాణం చూపిస్తాడు. రెండవది యుక్తి: అంటే మనిషి స్వభావం కనిపెట్టి వారికి కఠినంగాన లేక సాఫ్టుగాన లేక బిట్టర్గాన, ఎలా చెప్పాలి అనే అవగాహన. మూడు స్వానుభవం: అంటే ఆత్మ రుచి తెలిసి ఉన్నాడు. స్వానుభవాన్ని కలిపి చెప్పేసరికి ఎదుటివారు బోల్తా పడతారు.

- **గీతాంజలి లో ఠాగోర్ చెప్పిన మాట:**

✓ గీతాంజలి లో ఠాగోర్ అంటాడు: 'రాగము, భయము, కోపము - ఈ మూడిటి చేత ఇప్పుడు చుట్టబడి ఉన్నాను. ఎక్కడ రాగం లేదో, ఎక్కడ భయం లేదో, ఎక్కడ కోపం లేదో, ఓ తండ్రీ! నన్ను అక్కడికి మేల్కొలుపు'. ఇక్కడ తండ్రీ అంటే ఈశ్వరుడు అని అర్థం.

- **జాతీయగీతంలో భారతభాగ్యవిధాతా అంటే ఎవరు?**

✓ జన గణ మన అధినాయక జయహే భారత భాగ్య విధాత - ఆ భారత భాగ్య విధాత ఎవరని పేచీ వచ్చింది. భారత భాగ్య విధాత అంటే మనను పరిపాలించే ఇంగ్లాండ్ రాజా? అని అడిగితే ఠాగోర్ అన్నాడు: 'ఇంగ్లాండ్ రాజు కాదు, ఈశ్వరుడు' అని చెప్పాడు.

- **శాంతి ఎవరికి కలుగుతుంది?**

✓ శాంతి ఎవరికి కలుగుతుందో కృష్ణుడు భగవద్గీతలో ఇలా వివరించాడు:

✓ నిస్పృహః అంటే సుఖ దుఃఖాలను పట్టించుకోవద్దు, వాటిపై ఆసక్తి ఉండకూడదు. బుద్ధుడు రాజ్యాన్ని విడిచిపెట్టాక ఆయనకు రాజ్యం తాలూకు తలంపు రాలేదు. అలాగే సుఖ-దుఃఖాలు వచ్చి వెళ్లిన స్పృహ కూడా మనకు ఉండకూడదు.

✓ నిర్మమః అంటే ఎక్కడ attachment పెట్టుకోకు. నీ ఇంట్లోవారి పట్ల duty చేయి. మమకారమే మనకు తొందరగా ముసలితనం, చావు, అనారోగ్యం, అశాంతి తీసుకొస్తుంది. మమకారం లేకపోతే మనస్సు అసలు బాహ్యముకానికి రాదు.

✓ నిరహంకారః అంటే వ్యక్తిభావన ఉండకూడదు. నీ దేహంతోటి, పేరుతోటి, పరిస్థితులతోటి తాదాప్యం ఉండకూడదు.

- **యోగః కర్మ సుకౌశలం అంతరార్థం:**

✓ భౌతికమైన పని అయినా భగవంతుని ప్రీతి కోసం చేస్తే అది భౌతికమైన పనికాదు, ఆధ్యాత్మికమైన పని. మనకు ఇది ఇహము, అది పరము అనుకుంటాము. దేవుడికి ఆ తేడా లేదు. కనుక భౌతికమైన పని నేర్పుగా ఓర్పుగా చేయడం కూడా యోగం. ఫలకాంక్ష పట్ల ఆసక్తిలేకుండా పని చేయడం కూడా యోగం. పనిచేసేటప్పుడు పుణ్యపాపాలు అంటుకోకుండా చేయడం కూడా యోగం. ఇలా కర్మను యోగం గా చేస్తే పాత వాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు.

- **మనస్సుకు ఏ రెండు పనులు చేసే అలవాటు ఉంది?**

✓ మనస్సుకు రెండు పనులు చేసే అలవాటు ఉంది: నిన్ను బాగు చేస్తుంది లేక పాడు చేస్తుంది. అందుచేత మనస్సుని స్వాధీనంలోకి తెచ్చుకొని, మిత్రుడిగా చేసుకొని, నువ్వు బాగుపడటానికి ఉపయోగించుకో. అలా నిన్ను నీవు బాగుపరుచుకొనే ప్రయత్నం లో గనుక sincerity ఉంటే, భగవంతుని సహాయం నీకు అందుతుంది.

- **భగవద్గీతలో కృష్ణుడు ఇచ్చిన ఆశ్వాసనం:**

✓ భగవద్గీతలో కృష్ణుడు ఇచ్చిన ఆశ్వాసనం: 'మీలో ఏవైనా దోషాలు లేక బలహీనతలు ఉన్నాయి అనుకోండి, కంగారు పడకండి, తొందర పడకండి, worry పడకండి. ఆకాశం వచ్చి భూమిపైన వాలిపోయినా మీరు వర్రీ అవ్వద్దు. నేను ఉన్నాను. There is ఈశ్వర. అగ్గిపుల్ల వేస్తే ఒక గడ్డిమేటు తగలెడిపోతుంది. అలాగే మీలో ఎన్ని దోషాలు, లోపాలు ఉన్నప్పటికీ నా అనుగ్రహం వల్ల అన్నీ పోతాయి. అనుగ్రహించేవాడిని నేను ఉన్నాను కదా. మీ హృదయంలో ఉన్న బండరాళ్లను లాగి బయటపడేసే వాడిని నేను ఉన్నాను కదా'.

- **<u>భగవద్గీత సైన్స్ తోటి సమానమా?</u>**

✓ ఒక స్వామీజీ భగవద్గీతను సైన్స్ తో సమానమని convince చేయడానికి ప్రయత్నించారు. అయన ఉద్దేశ్యం ఏమిటంటే భగవద్గీతను సైన్స్ తోటి పోలిస్తే భగవద్గీత యొక్క గౌరవం పెరుగుతుంది అని. కానీ భగవద్గీత యొక్క గౌరవం తగ్గిపోతుంది. సైన్స్ అనేది బ్రెయిన్ నుండి పుట్టింది. ఏ సైన్స్ అయినా అది brain-child. కానీ భగవద్గీత భగవంతుని ముఖం లోంచి వచ్చింది. కనుక భగవద్గీతను సైన్స్ తో పోల్చడం చాలా తప్పు.

- **<u>ఒక కొత్త కోణంలో భగవద్గీత:</u>**

✓ శ్రీ నాన్నగారి తో ఒక భక్తుడు ఇలా అన్నాడు: "ఎందుకు నాన్నగారు రెండేసి మూడేసి గంటల ప్రవచనాలు? అర్జునుడిని తీసేయమని చెప్పి పంపేయండి. మనకు దుఃఖం, విషాదం, పునర్జన్మలు తీసుకొచ్చి, కర్మలో బంధింపబడేలా చేసేది ఈ జీవ లక్షణాలే కదా. ఆ జీవుడే కదా అర్జునుడు. వాడిని తీసేస్తే కృష్ణుడే కదా మిగుల్తాడు. జీవలక్షణాలను వదులుకోకుండా జ్ఞానం ఎలా కలుగుతుంది?"

- **<u>మస్తాన్ ఎందుకు నిజమైన ప్రేమకు నిదర్శనం?</u>**

✓ ఒకసారి శ్రీ కృష్ణ చైతన్యుడు మస్తాన్ అనే ముస్లిం భక్తుడిని 'నీకేమి కావాలి?' అని అడిగాడు. అప్పుడు మస్తాన్ అన్నాడు: 'నాకేమి అక్కర్లేదండి. మీరు లేని ప్రపంచం నేను చూడలేను. మీరు ఉండగా నన్ను పంపేయండి'. శ్రీ కృష్ణ చైతన్యుడు 'సరే' అన్నాడు. అలాగే చైతన్యుడు తాను సమాధి చెందే నాలుగు నెలల ముందే మస్తాన్ ని పంపేసి, తన చేతులతో మస్తాన్ సమాధి కట్టారు. అది real love, loyal love, undying love, faithful love.

- **<u>రామకృష్ణుడు అవతారపురుషుడు అని తెలిపే ఒక్క వాక్యం:</u>**

✓ పండితుడు: మీరు శాస్త్రాలు చదవడం కానీ వినడం కానీ జరిగిందా?

రామకృష్ణుడు: నాకు చదువు రాదు కానీ పండితులు చెపుతూండగా విన్నాను.

పండితుడు: నేను అనే తలంపు పోగొట్టుకోవాలి అని శాస్త్రాలలో చెప్పారు. అది మీరు పోగొట్టుకున్నారా?

రామకృష్ణుడు: విన్నప్పటి నుంచి పోగొట్టుకుందాం అని నేను కోసం వెదుకుతున్నాను కాని అది కనిపించడం లేదు.

ఈ ఒక్క వాక్యం చాలు రామకృష్ణుడు అవతార పురుషుడు అని తెలియచేయడానికి.

- <u>**చిన్ననాటి సంఘటనలు గుర్తుచేస్తే భగవాన్ ఏమన్నారు?**</u>

✓ చిన్ననాటి స్నేహితులు వచ్చి భగవాన్ దగ్గర చిన్నప్పటి సంఘటనలు చెబితే భగవాన్ అన్నారు: 'మీరు ఎరుగున్న వెంకట్రామన్ ఇక్కడ లేడు. వాడు చచ్చిపోయాడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు తెలియదు. నేను చెప్పినా మీకు అర్థం కాదు. మరణానుభవం కలిగినప్పుడు మీకు తెలుసున్న వెంకట్రామన్ చచ్చిపోయాడు'. అందరూ ఇప్పుడు ఉన్న శరీరం లో చచ్చిపోయి ఇంకొక శరీరం లో పుడతారు. కాని భగవాన్ మరణానుభవం ద్వారా ఆ శరీరంలో చచ్చిపోయి అదే శరీరంలో పుట్టాడు.

- <u>**అగౌరవం ఎప్పుడు భరించలేరు?**</u>

✓ గౌరవ అగౌరవాలు దేహ ప్రారబ్ధం బట్టి వస్తూ ఉంటాయి. దేహంతో తాదాప్యం పొందేవాడికే గౌరవ-అగౌరవాలు. దేహం, మనస్సుతో తాదాప్యం లేనప్పుడు గౌరవ అగౌరవాలు నిన్నేమీ చేయవు. Bear insult, bear injury, that is also part of sadhana. Bear cold wave, bear heat wave, that is also part of sadhana. మీకు గౌరవం అంటే ఇష్టం లేదనుకోండి, అగౌరవం వచ్చినా ఏమీ అనిపించదు. మీకు గౌరవం అంటే ఇష్టం ఉంటే అగౌరవం వస్తే భరించలేరు.

- <u>**ఫలకాంక్ష తో పనిచేసే వారు ఎవరితో సమానం?**</u>

✓ ఈ పని చేస్తే ఏ ఫలితం వస్తుంది? వారితో మాట్లాడితే మనకేమి కలిసి వస్తుంది? వారిని చూసి నవ్వితే ఏమి కలిసివస్తుంది? అని ఇలా ఫలకాంక్ష లేకుండా ఎవరైతే పని చేయడో, వారంతా

**కూలివారితో సమానం. అటువంటి వారికి స్వార్థమే పరమార్థం. self-centered గా ఉన్నవాడు self-realization ఆశించక్కర్లేదు.**

- **<u>గివింగ్ టేకింగ్ బదులు ఏమి వాడాలి?</u>**

✓ **గివింగ్ టేకింగ్ అనే పదాలు మన డిక్షనరీ లో తీసేద్దాము. వాటి బదులు మనం షేరింగ్ అని వాడుదాము. షేరింగ్ అనే మాటలో మనకు ఉద్రేకం రాదు. గివింగ్ టేకింగ్ లో ఉద్రేకం వస్తుంది. షేరింగ్ అనేది చాలా calm word, quiet word, cool word. అది neutral గా ఉంటుంది, రెచ్చగొట్టదు. టేకింగ్ అనే చోట న్యూనత రావచ్చు, గివింగ్ అనే చోట గర్వం రావచ్చు. కానీ షేరింగ్ వల్ల అలా అవ్వదు.**

- **<u>స్వామీజీ తన గురువులా ఎందుకు టీచ్ చేయలేదు?</u>**

✓ **స్వామి వివేకానందని ఒకరు ఇలా అడిగారు: 'అసలు టీచింగ్ లో మీకు, మీ గురువుకు, సంబంధం లేదు కదా?' అంటే స్వామీజీ అన్నారు: ' నేను మా గురువులా ఉండకూడదు. మా గురువు నాలా ఉండకూడదు. మా గురువు నాలా ఉంటే మా గురువు తప్పు. నేను మా గురువులా ఉంటే అది నా తప్పు.' ఇద్దరు మనుష్యులు ఒకేలా ఉండరు. రామకృష్ణ-వివేకానందులు అవసరానికి గురు-శిష్యులు అయ్యారు. వారు శివ-కేశవులు. శివుడి action ఒకలా ఉంటుంది, కేశవుని action ఒకలా ఉంటుంది. వాళ్ళే నర-నారాయణులు.**

- **<u>అసూయపడే వారి గురించి స్వామీజీ చెప్పిన కథ:</u>**

✓ **భారత దేశం లో ఉన్న అసూయ ప్రపంచంలోని ఏ దేశంలోనూ ఉండదు. స్వామి వివేకానంద చెప్పాడు: అందరూ పీతల మంగళాలు. అంటే మీరు డబ్బాలో పది పీతలను వేయండి. అందులో ఒక పీత పైకి వెళ్తూంటే, మిగితా తొమ్మిది పీతలు పైకివెళ్ళే పీతలను కిందికి లాగేస్తాయి. అలాగే ఎవరైనా బాగుపడుతున్నారు అంటే చాలు మిగితావారు వాడిని పడగొట్టేస్తారు.**

- **స్వామి వివేకానంద గురించి రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన మాట:**

✓ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నాడు: In Swami Vivekananda everything is positive. నెగటివ్ ని పాజిటివ్ ఎలా చేయాలో నేర్చుకున్నాడు వివేకానంద. నూటికి ముప్పై మార్కులు తెచ్చుకునేవారిని నువ్వు ఎందుకూ పనికి రావు అనడు. ఇంకా బాగా చదివితే నలభై మార్కులు వస్తాయి అని అంటాడు. చెడ్డవారిని నువ్వు చెడ్డవాడివి అని చెప్పడు. నువ్వు మంచివాడివే, కానీ ఈ మంచితనం జ్ఞానం సంపాదించడానికి సరిపోదు. ఇంకా మంచివాడివి అవ్వడానికి ప్రయత్నం చేయి అని అంటాడు.

- **శారదా మాత ఆఖరి మాటలు:**

✓ శారదా మాత శారదానందుల మధ్య ఉన్నది human relationship కాదు, అది divine relationship. శారదా మాత మధ్యాహ్నం భోజనం చేసాక నిద్రపోయే సమయానికి శారదానంద ఎంత పని ఉన్నా వచ్చి ఆవిడ గది దగ్గర కాపలా కాసేవారు. ఎందుచేత? ఆమెను ఎవ్వరు disturb చేయకూడదు అని. శారదా మాత ఆఖరి క్షణాల్లో శారదానంద అన్నారు: ' ఈ చివరి క్షణాల్లో, mortal నుండి immortal స్టేట్ కి వెళ్లే సమయంలో, ఒక మంచి మాట చెప్పు'. అంటే శారదా మాత ఒకే మాటను మూడు సార్లు చెప్పారు: 'సహనం, సహనం, సహనం'.

- **బెంగపెట్టుకునే వారిని వివేకానందుడు ఏమని తిట్టేవాడు?**

✓ వివేకానందకు ఒక అలవాటు ఉంది. ఎవరైనా బెంగపెట్టుకుంటే వారిని ఓదార్చడు, తిడతాడు: My friend, what makes you weep? ఆత్మను దుఃఖ పెట్టగల శక్తి ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? what makes you weep? నీలో ఉన్న Truth ని ఏడిపించగల సంఘటన ఈ యూనివర్స్ లో ఏదైనా ఉందా? లేదే. మరి ఎందుకు నీవంత దుఃఖ పడుతున్నావు? ప్రపంచం కంటే ప్రపంచంలోని సంఘటనల కంటే పెద్ద వస్తువు నీలో ఉందికదా. నీకు దుఃఖ కారణం ఈ ప్రపంచం లో ఏమి లేదు, నువ్వు కల్పించుకొని దుఃఖ పడుతున్నావు.

- **<u>చిల్లర గొడవలు అడుగుతూంటే భగవాన్ ఏమన్నారు?</u>**

✓ ఈ కోరిక ఎలా నెరవేరుతుంది? ఆ కోరిక ఎలా నెరవేరుతుంది? శుక్రవారం గిరిప్రదక్షిణ చేస్తే ఏ ఫలితం వస్తుంది? అని ఇలాంటి చిల్లర గొడవలు భక్తులు అడుగుతూంటే, భగవాన్ అన్నారు: 'ఏనుగు మీద కూర్చున్న వాడికి గాడిద మీద కూర్చోవాలనిపిస్తుందా? ఏనుగు మీద తిరిగేవాడు సరదాగా గాడిద మీద తిరగాలి అనుకుంటాడా? లేదు కదా. అలాగే ఆత్మానుభవం కలిగినవారికి మీరడిగిన చిల్లర గొడవలు అక్కర్లేదు'.

- **<u>హృదయంలో ఉన్న సత్యం ఎలా అనుభవం లోకి వస్తుంది?</u>**

✓ హృదయం లో ఉన్న సత్యం అనుభవం అవ్వడానికి మీ మనస్సు అంతర్ముఖం అవ్వాలి. మీరు పరిశీలించుకోవలసినది ఏమిటంటే అసలు మీ మనస్సు బాహ్యాముఖానికి ఎందుకు వెళ్తుంది? ఏ వ్యసనాలు, అలవాట్లు, వాసనల వలన బహిర్ముఖం అవుతోంది? ఇది ఎవరికి వారే చూసుకోవాలి గాని సమూహంగా చూసేది కాదు. ఆ వాసన ఎంత లోతుగా ఉందో చూసి దానిని తొలగించుకోడానికి ప్రయత్నించాలి. స్వప్రయత్నం ఉండాలి, కాలం కలసి రావాలి, గురువు కటాక్షం ఉండాలి, ఈశ్వర సహాయం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసి వస్తే గాని అది సాధ్యం కాదు.

- **<u>గవర్నర్ మేడ చూడమంటే శ్రీ రామకృష్ణులు అన్న మాట:</u>**

✓ నీ బుద్ధి బ్రహ్మంలో స్థిరపడితే ప్రపంచంలోని ఆకర్షణలు చూసి నీకు ఏ రకమైన వికారాలు కలుగవు. ఆత్మ శాంతి పొందాక నువ్వు పతనం అవుతావు అనే భయం ఉండదు, ప్రపంచం అంతా కాకి రెట్టతో సమానంగా కనిపిస్తుంది. ఒకసారి రామకృష్ణుడు మేనల్లుడు హృదయ్ అంటాడు: ' మామయ్యా, మామయ్యా గంగిరెద్దు లా తలవంచుకొని వెళ్తున్నావు, గవర్నర్ గారి మేడ చూడు, ఎంత గొప్పగా ఉందో', అంటే రామకృష్ణులు అన్నారు: ' ఒరేయ్ హృదయ్, మేడ అంటే ఏమి లేదు. ఇటుక మీద ఇటుక. రారా అదేమీ చూస్తావు'.

- **ఎవరు అదృష్టవంతులు?**

✓ ధనవంతులు, లేక బాగా చదువుకున్నవారు, లేక అనుకూలమైన భర్త గాని భార్య గాని దొరికినవారు, లేక నచ్చిన ఉద్యోగం దొరికినవారు - వీళ్ళు అదృష్టవంతులు అని అందరూ అనుకుంటారు. కానీ వీళ్లందరి కన్నా శాంతచిత్తం కలిగినవారు అదృష్టవంతులు. వారికి గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా, ప్రతికూల పరిస్థితులు ఎదురు అయినా, శాంత చిత్తం నుండి కదలరు. ఎందుచేత? వారు పరమాత్మలో స్థిరపడి ఉన్నారు కాబట్టి.

- **భగవంతుడు ఎలా పని చేస్తున్నాడు?**

✓ భగవద్గీత లో కృష్ణుడు అంటాడు: 'ఓ అర్జున, ఓ ధనుంజయ, నాకేమీ అక్కర్లేదు. అయినా చూడు ఎంత పని చేస్తున్నానో. ఇది రాత్రి అని తెలియడం లేదు, పగలు అని తెలియడం లేదు. చేసే పని కూడా సంతోషంగా చేస్తున్నాను గాని ఏడుస్తూ చేయడంలేదు'.

- **రుద్రాభిషేకం అంతరార్థం:**

✓ ఓ శివ, రుద్ర, నేను నిన్ను నీళ్ల తో కడుగుతున్నాను. నా బుద్ధిలోని దోషాలను నీ దయతో కడుగు.

- **శ్రీ నాన్నగారి విశ్వజనీన సందేశం:**

✓ మీకు, నాకు, దేవతలకు, అందరికీ ఆధారంగా ఉన్న వస్తువు, అందరికీ వెలుతురునిచ్చే వస్తువు, ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. మీకు ఇష్టమైన ఏ నామ రూపాల ద్వారా అయినా సరి, లోపలికి ప్రవేశించండి. ఎందుకంటే లోపల ఉన్న పదార్థం ఒక్కటే, పిండి ఒక్కటే, సత్యం ఒక్కటే. మీరు ఏ ముఖం లోంచి లోపలికి వెళ్లినా బ్రహ్మం లోకి వెళ్ళవల్సిందే.